FOR ADS.......
ఆకాంక్ష
CONTACT : 8333818121

# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :143 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 13 - జనవరి - 2026

## రాష్ట్రంలో 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు




### 14 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

### వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా రోణంకి గోపాలకృష్ణ

అమరావతి : రాష్ట్రంలో 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్?లు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పలు జిల్లాల జాయింట్ కలెక్టర్లను బదిలీ చేసి వారి స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించింది. బదిలీ చేసిన వారిని పలు విభాగాల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లను నిర్ణయించింది. మార్కాపురం జాయింట్ కలెక్టర్‌గా పి. శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా రోణంకి గోపాలకృష్ణలు నియమితులయ్యారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, మిగతా..2లో

## తెలంగాణ సర్కారుకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు



### పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీం తీర్పు

### తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ విచారణకు అర్హత లేదన్న సుప్రీం

### పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సుప్రీం స్పష్టం చేసింది. తెలంగాణ తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పోలవరం ప్రాజెక్టును నల్లమల్ల సాగర్‌తో లింక్ చేయడం వల్ల తెలంగాణకు నష్టమని, గోదావరి నీటి కేటాయింపులు ఉల్లంఘన అవుతున్నాయని కోర్టుకు ఆయన వివరించారు. మిగతా..2లో

## సుప్రీంకోర్టు సాక్షిగా రేవంత్ ద్రోహ బుద్ధి బయటపడింది రావు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ముఖ్యమంత్రిగా ఉంటూ తెలంగాణ నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేస్తూ తెలంగాణకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.

హైదరాబాద్, జనవరి 12: నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా

# కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు

- సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ అండ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా




హైదరాబాద్: : ఉద్యోగులే తమ సారథులు, వారధులు అని సీఎం రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన అప్పులు తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరన్న ముఖ్యమంత్రి, రాష్ట్రాన్ని నడిపేది 10.50 లక్షల మంది ఉద్యోగులని, ఉద్యోగులు సరిగా పని చేయడం వల్లే పథకాలు సరిగా అమలు అవుతున్నాయని కితాబిచ్చారు. హైదరాబాద్?లోని సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ మిగతా..2లో

## కాంగ్రెస్‌ను పండపెట్టి

# తొక్కి గెలుస్తాం

- కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.
- కాంగ్రెస్ పార్టీ 'బంగారం ఇచ్చే బ్యాచ్ కాదు, పుస్తెలు తాడు దోచే రకం' అని తీవ్రంగా విమర్శించారు.
- రెండేళ్లలో ఎవరికీ న్యాయం జరగలేదని మండిపడ్డారు.



హైదరాబాద్: మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా మీడియా కథనాలు రాయడం సరికాదని హితవు పలికారు. నల్గొండ జిల్లాలోనే కాదని, చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగాయని ఆయన అన్నారు. మిగతా..2లో

## బడ్జెట్‌లో గణాంకాల గారడీ వద్దు వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించాలి



- త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు.
- వాస్తవాలకు దగ్గరగా ఉండాలని సూచన

ఢిల్లీ: 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్?ను పార్లమెంట్?లో ప్రవేశపెట్టడానికి కేంద్రం సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, గణాంకాల గారడీలతో సరిపెట్టుకుంటుండా, మిగతా..2లో

## భారత సంస్కృతి, తత్వశాస్త్రానికి స్వామి

# వివేకానంద గొప్ప అంబాసిడర్

- సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, అధివక్త పరిషత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సీజేఐ
- ఇసుకతో అద్భుతంగా తీర్చిదిద్దిన మానస్ కుమార్ సాహూ



ఢిల్లీ : భారత సంస్కృతి, తత్వశాస్త్రానికి స్వామి వివేకానంద గొప్ప అంతర్జాతీయ రాయబారి అని కొనియాడారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, అధివక్త పరిషత్? సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సీజేఐతో పాటు పలువురు ఇతర న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు హాజరయ్యారు. "స్వామి వివేకానంద పలికిన మిగతా..2లో

## ఏఐ' సాంకేతికతతో

# నిజమైన ఓటర్లకు తిప్పలు

- 2002 ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌లో భారీ తప్పిదాలు
- అర్హులైన ఓటర్లకు తిప్పలు
- ఎస్ఐఆర్ ప్రక్రియపై మమతా బెనర్జీ ఆగ్రహం

### సీఈసీకి సీఎం మమత మరో లేఖ!



ఢిల్లీ : బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను వాడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఒక లేఖ రాశారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ మొదలైనప్పటి నుంచి సీఈసీకి మమత రాసిన ఐదో లేఖ ఇది. టెక్నాలజీ పేరుతో సామాన్య ఓటర్లను వేధిస్తున్నారని ఆమె ఈసీ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో మిగతా..2లో

## యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది



- నేడు జాతీయ యువజన దినోత్సవం (స్వామి వివేకానంద జయంతి)
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్
- ఈ ప్రభుత్వంలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని వ్యాఖ్య

అమరావతి : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ...

## దేశంలోనే రోల్ మోడల్, గేమ్ ఛేంజర్‌గా

# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

- తెలంగాణ వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.
- ఇది.. తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోస్తోందని ఆయన అన్నారు.
- దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు.



హైదరాబాద్, జనవరి 12: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉపముఖ్యమంత్రి మరోసారి తన నిబద్ధతను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లతో ఇవాళ(సోమవారం) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు భట్టి. స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనన్నారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని

## శిర్డీ సాయిబాబాను దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్ దంపతులు




- శిర్డీ సాయి సన్నిధిలో కాగడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ ఆయన సతీమణి
- స్వాగతం పలికి, శాలువతో సత్కరించిన ఆలయ ట్రస్ట్ సభ్యులు, అధికారులు

ఆకాంక్ష
మంగళవారం- 13 - జనవరి - 2026

## మొదటి పేజీ తరువాయి

### దేశంలోనే రోల్ మోడల్, గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ ఆదేశాల ద్వారా ప్రాజెక్ట్ అమలులో వేగం, జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా చూస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాగా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తెలంగాణ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా-కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. బడ్జెట్‌లో రూ.11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ.21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

#### సామాజిక సమానత్వం, విద్యా విప్లవం..

ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

### రాష్ట్రంలో 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు

ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పన కుమారి, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా కతవాటె మయూర్ అశోక్, తిరుపతి జేసీ, తుడా వైస్ ఛైర్మన్‌గా ఆర్. గోవిందరావు, కడప జాయింట్ కలెక్టర్‌గా నిధి మీనాలు నియమితులయ్యారు. కడప జేసీగా నియమితులైన నిధి మీనా కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ భార్య కావడం విశేషం. ఇక అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా సి. విష్ణుచరణ్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా మల్లవరపు సూర్యతేజ, చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీగా ఎస్.ఎస్. శోభిక, విశాఖ జాయింట్ కలెక్టర్‌గా గొబ్బిళ్ల విద్యాధరి, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్ శర్మ, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వి. సంజనా సింహాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. బదిలీలు, నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

### శిర్డీ సాయిబాబాను దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్ దంపతులు

అమరావతి: శిర్డీలోని సాయినాథుడ్ని మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి దర్శించుకున్నారు. సాయిబాబాకు నిర్వహించే కాగడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ దంపతులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు, అధికారులు స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. హారతి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. మంత్రి లోకేశ్ వెంట ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు ఉన్నారు. రాష్ట్ర ప్రజల మేలు కోసం ప్రార్థన : ఈ సందర్భంగా నారా లోకేశ్? మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం బాబాను ప్రార్థించినట్లు? తెలిపారు. దక్షిణ భారతదేశంలో సంక్రాంతి పండగ జరుగుతున్న నేపథ్యంలో ఆయన పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాయి బాబా సమాధిని దర్శనం చేసుకున్న తర్వాత, నారా లోకేశ్? దంపతులు ద్వారకామాయి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వారిద్దరూ సాయిబాబా గురుస్థానాన్ని కూడా దర్శించుకుని, గురుస్థాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దర్శనం పూర్తి అయిన అనంతరం, సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష్ గడిల్కర్ నారా లోకేశ్?కు శాలువా కప్పి సాయిబాబా విగ్రహాన్ని ఇచ్చి సత్కరించారు. సాయిబాబా సంస్థాన్ సీఈవోతో భేటీ : ఈ నేపథ్యంలో నారా లోకేశ్? సాయిబాబా సంస్థాన్ సీఈఓ గోరక్ష్ గడిల్కర్?తో భేటీలో పాల్గొన్నారు. దక్షిణ భారతదేశం నుంచి సాయిబాబా దర్శనం కోసం ప్రతిరోజూ ఎంత మంది భక్తులు శిర్డీకి వస్తారు? సాయిబాబా సంస్థ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తుంది అనే పలు అంశాల గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్? మాట్లాడుతూ, తాను మొదటిసారి శిర్డీకి వచ్చానన్నారు. సాయిబాబా సమాధి దర్శనం చేసుకునే అదృష్టం తనకు కలిగిందని, ఉదయం కాగడ హారతి చూడటం ఎంతో సంతృప్తిగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. బాబా దర్శనం తర్వాత లోకేశ్? ఆలయ ప్రాంగణానికి వచ్చిన వెంటనే, దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. అనంతరం లోకేశ్? దంపతులు ప్రైవేట్ విమానంలో తిరుపతికి బయలుదేరారు.

#### 'బాబా పిలిచారు, వచ్చేశా- త్వరలో 100వ సినిమా స్టార్ట్- శిర్డీలో కింగ్ నాగార్జున

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా లోకేశ్? ఘన నివాళి : ఇదిలా ఉండగా మరోవైపు వివేకానంద స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేద్దామని మంత్రి లోకేశ్? పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా లోకేశ్? ఘన నివాళులర్పించారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు, యువతకు ఆదర్శప్రాయుడని గుర్తు చేశారు. తన ప్రసంగాలతో నవతరానికి దిశానిర్దేశం చేశారన్నారు. ఆధునిక భారత నిర్మాణం కోసం పరితపించారని కొనియడారు. లక్ష్య సాధనలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా గమ్యం చేరే వరకు విశ్రమించవద్దని పిలుపునిచ్చారని తెలిపారు. వివేకానంద స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేద్దామని లోకేశ్? పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన... నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

### కాంగ్రెస్‌ను పండపెట్టి తొక్కి గెలుస్తాం

మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుందని వ్యాఖ్యానించారు. అధికారుల మీద అభాండాలు వేయడం సరికాదని అన్నారు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం కాకుండా, వాస్తవాలు రాయాలని సూచించారు. ఛానళ్ల మధ్య రేటింగ్ పోటీ కోసం అధికారులను, ముఖ్యంగా మహిళా అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. కేవలం మంత్రుల పైనే కాదని, ముఖ్యమంత్రిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తెలంగాణ సర్కారుకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

వాదనలు విన్న సుప్రీంకోర్టు... ఈ పిటిషన్ ను కొనసాగించలేమని, ఈ కేసుతో కర్ణాటక, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాలు కూడా ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. అందుకే, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు (మీడియేషన్ లేదా సివిల్ సూట్) ద్వారా పరిష్కారం కోరవచ్చని సూచించింది. దీంతో, తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని సుప్రీంకోర్టుకు సింఘ్వీ తెలిపారు. సివిల్ సూట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.

### ఏఐ' సాంకేతికతతో నిజమైన ఓటర్లకు తిప్పలు - సీఈసీకి సీఎం మమత మరో లేఖ!

సాంకేతిక లోపాలను తన లేఖ ద్వారా ఎత్తిచూపారు. "ఎన్నికల సంఘం 2002 నాటి ఓటర్ల జాబితాను డిజిటలైజ్ చేసింది. ఇందుకోసం 'ఏఐ టూల్స్ను వినియోగించింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఏఐ చేసిన తప్పుల వల్ల అర్హులైన, నిజమైన ఓటర్ల వివరాల్లో భారీగా తేడాలు వచ్చాయి. ఆ తప్పులను సాకుగా చూపి, అసలైన ఓటర్లను కూడా 'లాజికల్ డిస్క్రిపెన్సీస్ల జాబితాలో చేర్చారు. దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని అన్నారు.

#### పాత ఓటర్లకు కొత్త కష్టాలు

గత రెండు దశాబ్దాలుగా ఓటు హక్కు ఉన్నవారిని ఇప్పుడు ఇబ్బంది పెట్టడంపై మమత మండిపడ్డారు. "గత 20 ఏళ్లుగా వారు ఓటు వేస్తున్నారు. గతంలోనే విచారణలు జరిపి వారి తప్పులను సరిచేశారు. ఇప్పుడు మళ్లీ పిలిచి, మీ గుర్తింపును నిరూపించుకోండి అని అడగడం దారుణం. సొంత చట్టబద్ధమైన ప్రక్రియలనే ఈసీ ఉల్లంఘిస్తోంది. రెండు దశాబ్దాల రికార్డులను కాదని, ఇప్పుడు కొత్తగా అనుమానించడం ఏకపక్షం.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా - కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు

### మొదటి పేజీ తరువాయి

2026 డైరీ అండ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి రేవంత్? రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్? ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే కావాల్సిన నిధులు అవే వస్తాయన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూళ్లు చేస్తే చాలన్న సీఎం, చాలా మందిని పన్ను కట్టాలని ఉద్యోగులు అడగట్లేదన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చినట్లు చెప్పిన రేవంత్? రెడ్డి, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చినట్లు సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్ ఉన్నాయి. గత ప్రభుత్వం వదిలివెళ్లిన అప్పులు తీర్చేందుకు



కృషి చేస్తున్నాం. ఉద్యోగుల్లో కూడా నేను నచ్చనివారు చాలా మంది ఉండవచ్చు. నేను వచ్చాక జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చా. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. - సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పునర్విభజన కోసం ప్రత్యేక కమిటీ : రాష్ట్రంలో త్వరలో జిల్లాల పునర్విభజన ఉంటుందన్న సీఎం, ఇందుకోసం రిటైర్డ్? జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తామని తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుందన్నారు. గతంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా జరిగిందన్న సీఎం, జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని, అందుకే మార్చినట్లు సీఎం పేర్కొన్నారు. రాచకొండ పేరు రాచరిక పాలనకు గుర్తుగా ఉందని మార్చామన్నారు. సికింద్రాబాద్ విషయంలో తాను వచ్చాక చేసిందేమీ లేదని, సికింద్రాబాద్ గతంలోనే జీహెచ్ఎంసీలో భాగంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో జిల్లాల విభజన సరిగా జరగలేదు. రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా చేశారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. త్వరలో జిల్లాల పునర్విభజన ఉంటుంది. ఇందుకోసం రిటైర్డ్? జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తాం. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుంది. అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తాం.

## పోలవరం పూర్తయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీపడలేదు

### మొదటి పేజీ తరువాయి

ఇప్పటికి పంపిణీ చేయగలిగామనీ, అందుకుగాను రూ.2,684 కోట్లు వ్యయం చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏడాదిన్నరలో రూ.50,000 కోట్ల మేర సామాజిక పెన్షన్లను అందించటంలో సంక్షేమంలో సరికొత్త మైలురాయిని సాధించామని తేల్చి చెప్పారు. దాదాపు 70 వరకూ పెద్ద పథకాలు, కార్యక్రమాలు, పనులు చేశామని చంద్రబాబు తెలిపారు. అమరావతిని శ్మశానం, ఎడారని ఎగతాళి చేశారనీ, కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని స్పష్టం చేశారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. పోలవరం అత్యద్భుత ప్రాజెక్టు: పోలవరం అత్యద్భుతమైన ప్రాజెక్టనీ, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రతీ ఏటా 3,000 టీఎంసీల మేర నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తోందన్న సీఎం, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వటం ద్వారా శ్రీశైలంలోని నీటిని పొదుపు చేసి రాయలసీమకు ఇస్తున్నట్లు వివరించారు. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం తదితర ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరికీ నష్టం లేదని తేల్చిచెప్పారు. పుష్కరాల్లోగా పోలవరం నిర్మాణం!: ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్?కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణా రాష్ట్రం సైతం వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలూ గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవచ్చుననే అభిప్రాయాన్ని సీఎం చంద్రబాబు వ్యక్తం చేశారు. పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును నిర్మించి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్టు కూడా త్వరలోనే జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్?ను కేంద్ర సహకారంతో రూ.12,000 కోట్ల సాయంతో దానిని కాపాడుకున్నామని చెప్పారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ ఆ ప్లాంట్?ను నిలబెట్టి తీరుతామని తేగ్గేసి చెప్పారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయని వివరించారు. పెట్టుబడులకు ప్రధాన కేటంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని చంద్రబాబు అన్నారు. సీఐఐ ద్వారా చేసుకున్న ఒప్పందాలు అన్నీ సాకారం అయితే 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఎస్ఐపీబీ ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం కూడా ఇచ్చామనీ, వీటి ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్?ను విశాఖలో ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావటంలో కృషి చేసిన అధికారులు, ప్రభుత్వ విభాగాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు. ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్: అమరావతిలో క్వాంటం వ్యాలీకి త్వరలో ఫౌండేషన్ వేస్తామనీ, ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్ ఇక్కడి నుంచి పనిచేస్తుందని తేల్చి చెప్పారు. విద్యుత్ కొనుగోలు ధరను గణనీయంగా తగ్గించగలిగామనీ, అంతేకాకుండా భవిష్యత్తులో 1.19 పైసల మేర యూనిట్ కొనుగోలు ధర తగ్గించటం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లలోనూ 970 టీఎంసీలను నింపగలిగామనీ, రాయలసీమలోనూ పెద్ద ఎత్తున నీటిని నిలిపామని చంద్రబాబు చెప్పారు. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. రీసర్వే ప్రక్రియను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేశారని వివరించారు. ఈ 2026 ఏడాదిలో ల్యాండ్ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ విభాగంలోనూ పూర్తి పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. మంత్రులకు దిశానిర్దేశం: అంతేకాకుండా వీబీ జీ రామ్ జీ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని కమ్యూనిటీ ఆస్తులు మరింతగా పెరిగే




అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 25 ఏళ్ల క్రితమే పీపీపీ విధానంలో జాతీయ రహదారుల నిర్మాణం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఇవాళ గిన్నిస్ రికార్డును సాధించే దిశగా రహదారుల నిర్మాణం జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. చేసిన పనులు సమర్థంగా ప్రజలకు చెప్పుకోవటం ముఖ్యమని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. కలియుగ వైకుంఠం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామిపై ప్రజలకు అంత నమ్మకమని చంద్రబాబు పేర్కొ?న్నారు. ఇటీవల కాలంలో క్షేత్రాన్ని అపవిత్రం చేసే ప్రయత్నాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరకామణిలో దొంగతనం జరిగితే సమర్ధించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కల్తీ నెయ్యితో ప్రసాదం తయారీ, ఖాళీ మద్యం బాటిళ్లను తిరుమలలో పెట్టడం లాంటి దుర్మార్గపు పనులకు పాల్పడ్డారని అరాచకవాదులను దుయ్యబట్టారు. దేవుడితో కూడా రాజకీయం చేస్తున్నారనీ, ఇది చాలా బాధాకరమని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. "అచంచలమైన విశ్వాసంతో ప్రగతి దిశగా ముందుకు వెళ్తున్నాం. రానున్న కాలంలో సైతం సంక్షేమం, అభివృద్ధి వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలందరి ఆదరాభిమానాలను అందుకోవాలి. సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగాం. ఈ ఏడాది సైతం మరింత కష్టించి పనిచేద్దాం

## సుప్రీంకోర్టు సాక్షిగా రేవంత్ ద్రోహ బుద్ధి బయటపడింది

### మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. దీనిపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లమల సాగర్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తున్న రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని వ్యాఖ్యలు చేశారు. విచారణ అర్హత లేని పిటిషన్ వేసి ఏపీ ప్రభుత్వం అక్రమంగా పోలవరం నిర్మిస్తోందని మండిపడ్డారు. నాడు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలోనూ రైతులతో ఏపీ ప్రభుత్వం రిట్ వేయించిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని మాజీ మంత్రి ఆరోపించారు.

అది ముగియని కథే...

'ఈ మాత్రం విషయం మీ న్యాయవాది, మీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా?. ఈ మాత్రం దానికి నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా వెళ్లాలా?' అంటూ ఎద్దేవా హరీష్ చేశారు. ముఖ్యమంత్రిగా ఉంటూ తెలంగాణ నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేస్తూ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. రిట్ ఉపసంహరించుకొని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం- నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమే అని హరీష్‌రావు విమర్శించారు. ఏపీ, తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథే అని మాజీ మంత్రి అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకొని, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ అప్పనంగా నీళ్లను తరలించుకుపోతుందని మండిపడ్డారు. సంక్రాంతి పండుగ వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్.. సుప్రీంకోర్టులో వేసిన ఈ బలహీనమైన రిట్ అంటూ మాజీ మంత్రి హరీష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

పోను.. పెట్టను అంటూనే ద్రోహం...

పోలవరం-నల్లమల సాగర్ విషయంలో ముందు నుంచీ రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి పూర్తిగా సహకరిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లారని.. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారన్నారు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. వేయను అంటూనే కమిటీ వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశారని ఆరోపణలు చేశారు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్లి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపారని మండిపడ్డారు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్‌కు మద్దతు ప్రకటించారంటూ సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు.

రేవంత్ మాటల ఆంతర్యమేంటి?

తాము నిలదీస్తే బనకచర్లను అడ్డుకుంటామని, సుప్రీంకోర్టుకు వెళ్తామని నమ్మ బలికిన రేవంత్ రెడ్డి, నేడు కావాలనే బలహీనమైన పిటిషన్ వేసి తెలంగాణకు మోసం చేశారని ఆరోపణలు చేశారు. పంచాయతీలు వద్దు, న్యాయస్థానాలు వద్దు కూర్చొని చర్చించుకుందామన్న రేవంత్ రెడ్డి మాటల అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పచెప్పడమేనా చర్చల లక్ష్యమని నిలదీశారు. తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నిస్తూ.. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని హరీష్ రావు హెచ్చరించారు. 'రేవంత్ రెడ్డి.. నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తాం' అంటూ మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు.

## బడ్జెట్‌లో గణాంకాల గారడీ వద్దు- వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించాలి

### మొదటి పేజీ తరువాయి

వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా బడ్జెట్?ను ప్రతిపాదించాలని ఆయన పేర్కొన్నారు. కేవలం జీడీపీ అంకెలు గొప్పగా చూపిస్తే సరిపోదన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పన, సామాన్యుడి పొదుపు దారుణంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జైరాం రమేశ్ 'ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం గణాంకాలతో ఆర్థిక వ్యవస్థ అంతా బాగుందనే భ్రమను కల్పిస్తోందని, ఈ బడ్జెట్‌తోనైనా ఆ అలాంటి ఆలోచనల నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. 2026-27 బడ్జెట్‌ను మరో ఇరవై రోజుల్లో పార్లమెంట్?లో ప్రవేశపెట్టనుందని, ఇదే సమయంలో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఈ బడ్జెట్ కచ్చితంగా ప్రతిబింబిస్తుందని రమేష్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్ల( 2026-27 నుంచి 2031-32) కాలానికి సంబంధించిన ఈ సిఫార్సులు కేంద్ర-రాష్ట్రాల మధ్య పన్ను ఆదాయాల పంపిణీ, రాష్ట్రాల మధ్య ఆ నిధుల కేటాయింపుకు నిర్దేశిస్తాయన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ బలవంతంగా తీసుకొచ్చిన 60:40 వ్యయ విధానంతో రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఇప్పుడు రాబోయే 16వ ఆర్థిక సంఘం కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయని చెప్పుకొచ్చారు. "16వ ఆర్థిక సంఘం తన నివేదికను 2025 నవంబర్ 17న సమర్పించింది. 2026-27 నుంచి 2031-32 వరకు పన్నుల వాటా ఎలా ఉండాలనేది అందులో ఉంటుంది. అయితే రాష్ట్రాలు ఇప్పటికే ఉపాధి హామీ పథకం నిధుల్లో కేంద్రం ఏకపక్షంగా తెచ్చిన 60:40 నిష్పత్తి నిబంధన రాష్ట్రాల మెడపై కత్తిలా మారింది. ఇప్పుడు పన్నుల వాటాలో ఇంకేం కోతలు పెడతారోనని రాష్ట్రాలు ఆందోళనలో ఉన్నాయి"

- జైరాం రమేష్

#### మూడు ప్రధాన సవాళ్లు ఇవే

భారత ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా మూడు సమస్యలు పట్టి పీడిస్తున్నాయని జైరాం రమేశ్ విశ్లేషించారు. "కార్పొరేట్ కంపెనీలకు పన్ను మినహాయింపులు ఇచ్చారు. అవి భారీగా లాభాలు గడిస్తున్నాయి. అయినా సరే, అవి తిరిగి కొత్త పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడం లేదు. పెట్టుబడులు రాకపోతే కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయి? దేశంలో గృహ పొదుపు రేట్లు గణనీయంగా పడిపోయాయి. మధ్యతరగతి ప్రజల చేతిలో డబ్బు నిలవడం లేదు. ఇది దేశ పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది. దేశంలో సంపద, ఆదాయం, వినియోగంలో అసమానతలు అంతకంతకూ లోతుగా మారుతున్నాయి. ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఈ అగాధాన్ని పూడ్చకపోతే ప్రమాదం తప్పదు" అని అన్నారు. కేవలం జీడీపీ వృద్ధి రేటును చూసి మురిసిపోవద్దని కాంగ్రెస్ నేత హితవు పలికారు. "అధిక జీడీపీ రేట్లు ఉన్నంత మాత్రాన సరిపోదు. అది ఉద్యోగాలను సృష్టించే వృద్ధి అయి ఉండాలి. పైన చెప్పిన మూడు సమస్యలను పరిష్కరించకపోతే, ఈ వృద్ధి రేటు నిలకడగా ఉండదు. అది గాలిలో దీపంలా ఆరిపోతుంది" అని జైరాం రమేశ్ హెచ్చరించారు.

#### బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఇదే

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జనవరి 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అయితే ఈసారి ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో తేదీపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. బడ్జెట్‌కు ముందు ఎకనామిక్ సర్వేను ప్రవేశపెడతారు.

## భారత సంస్కృతి, తత్వశాస్త్రానికి స్వామి వివేకానంద గొప్ప అంబాసిడర్

### మొదటి పేజీ తరువాయి

ప్రతి మాట ముఖ్యమైనది, ఇంకా దూరదృష్టితో కూడుకున్నది. ముఖ్యంగా నైతిక, ధార్మిక విలువలతో నిండినది. ఆయన వ్యాఖ్యలు మన దేశ గొప్ప వారసత్వం, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించింది. ఆయన భారత సంస్కృతి, తత్వశాస్త్రానికి గొప్ప అంతర్జాతీయ రాయబారి."

#### జస్టిస్ సూర్యకాంత్?, భారత ప్రధాన న్యాయమూర్తి

స్వామి వివేకానంద ఒక గొప్ప, దూరదృష్టి గల నాయకుడని జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. దేశానికి ఆయన బోధనలు చాలా ముఖ్యమైనవని అభిప్రాయపడ్డారు. "స్వామి వివేకానంద ఒక గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి. ఆయన బోధనలు ఎల్లప్పుడూ సముచితంగా ఉంటాయి. ముఖ్యంగా కొత్త తరానికి, ఈ దేశానికి అత్యంత అవసరమని నేను నమ్ముతున్నాను." అని ఆయన అన్నారు. హిందూమత ఔన్నత్యాన్ని దేశవిదేశాల్లో చాటిచెప్పి దేశ ఖ్యాతిని పెంచిన విశ్వగురువు వివేకానందుడు. ఆయన 1863 జనవరి 12న కలకత్తాలో జన్మించారు. తల్లిదండ్రులు ఆయనకు నరేంద్రనాథ్ దత్?గా పేరు పెట్టగా, అనంతర రామకృష్ణ పరమహంస శిష్యులుగా మారి వివేకానందగా ప్రసిద్ధి చెందారు. 1984లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. ఫలితంగా 1985 నుంచి జనవరి 12ను భారత్?లో జరుపుకొంటున్నారు.



#### ఆకట్టుకుంటున్న స్వామి వివేకానంద సైకత చిత్రం

మరోవైపు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఒడిశాలో సైకత శిల్పకళాకారుడు వేసిన స్వామి వివేకానంద చిత్రం ఆకట్టుకుంటోంది. మానస్ కుమార్ సాహూ అనే కళాకారుడు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇసుకతో అద్భుత ఆకృతిని తీర్చిదిద్దారు. అబ్బురపరిచే ఈ కళాకృతిని రూపొందించేందుకు 2 గంటల సమయం పట్టినట్టు సాహూ తెలిపారు. ఈ చిత్రంలో స్వామి వివేకానంద రూపంతో పాటు యువత సమూహంగా ఆయన వెంట నిల్చున్నట్టు సాహూ రూపొందించారు. అంతేకాకుండా జాతీయ యువజన దినోత్సవం అనే అర్థం వచ్చే ఆంగ్ల అక్షరాలను సాహూ అందులో పొందుపరిచారు.

## ఇది కదా మైండ్ బోయింగ్ ఆఫర్ అంటే.. రూ. 8 లక్షల కారు కొంటే.. లైఫ్‌టైం బ్యాటరీ ఫ్రీ..!




దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రముఖ కంపెనీలు ఆకర్షణీయమైన ఆఫర్లను అందుబాటులోకి తెస్తోంది. టాటా కంపెనీ ఆ మేరకు త్వరలోనే ఓ ఆఫర్ తెస్తోంది. మరి ఆ వివరాలు ఏంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా.. ఓ సారి మీరూ లుక్కేయండి మరి.

దేశంలో ఎలక్ట్రిక్ ఫోర్-వీలర్ విభాగం గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. పెట్రోల్ కార్లతో పోలిస్తే నెలవారీ పొదుపుతో పాటు, ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. జుం బ్యాటరీ జీవితకాలం వస్తుందా.? అనే సందేహాలను తీరుస్తూ.. ప్రముఖ కంపెనీలు వివిధ రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఒక ఎలక్ట్రిక్ కారు ధరలో బ్యాటరీ ధర దాదాపు 60 శాతం ఉంటుంది. సాధారణంగా ఎలక్ట్రిక్ కార్ బ్యాటరీలు ఎనిమిది నుంచి పది సంవత్సరాలు లేదా రెండు లక్షల కిలోమీటర్ల వరకు పనిచేస్తాయి. ఆ తర్వాత కాలక్రమేణా వాటి పరిధి తగ్గుతుంది.

లైఫ్ టైమ్ వారంటీ అంటే సాధారణంగా దేశంలో 15 సంవత్సరాలు ఉంటుంది. మొదటి యజమానికి అపరిమిత కిలోమీటర్ల వరకు కవరేజీని అందిస్తుంది. టాటా మోటార్స్ జుం, నెక్సాన్ జుం మోడళ్లు త్వరలో జీవితకాల బ్యాటరీ వారంటీని అందించనున్నాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ లిమిటెడ్ 2025-26 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 22 శాతం వృద్ధి సాధించింది. మూడవ త్రైమాసికంలో(అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు), కంపెనీ మొత్తం 1,71,013 వాహనాలను విక్రయించింది. గతేడాది ఇదే సమయంలో 1,39,829 యూనిట్లను విక్రయించింది. గతంతో పోలిస్తే ఇది 22 శాతం వృద్ధి. ఎలక్ట్రిక్ వాహనాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి నేపధ్యంలో కంపెనీలు ఈ మేరకు పలు ఆఫర్లను అందుబాటులోకి తెస్తున్నాయి.

## 5 స్టాక్స్‌తో రూ. 4 కోట్లు..! ఉద్యోగంతో పన్లేదిక.. దెబ్బకు తలరాతే మారుతుంది



స్టాక్ మార్కెట్‌లో ఎక్కువగా నష్టాలే వస్తాయి. అస్సలు దాని జోలికి వెళ్లకపోవడమే మంచిదని అంటుంటారు. అయితే 90 శాతం మంది నష్టపోవడానికి ట్రేడింగ్ వర్సెస్ ఇన్వెస్టింగ్‌పై అవగాహన లేకపోవడం, మల్టీబ్యాగర్ స్టాక్స్‌ను గుర్తించడం, స్టాప్ లాస్ మరవడం లాంటివి ప్రధాన కారణాలు.. స్టాక్ మార్కెట్ అంటేనే చాలామందికి డబ్బు పోతుందనే భయం ఉంటుంది. అయితే లక్ష రూపాయలతో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ మొదలుపెట్టి.. సరైన అవగాహనతో లక్షలు, కోట్లు సంపాదించవచ్చునని బిజినెస్ నిపుణులు అంటున్నారు. స్టాక్ మార్కెట్‌లో 90 శాతం మంది డబ్బు కోల్పోవడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. మార్కెట్‌ను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం, సరైన జ్ఞానం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలని బిజినెస్ నిపుణుడు గణేష్ కుమార్ అట్లూరి అన్నాడు. స్టాక్ మార్కెట్ అంటే వ్యాపారంపై వ్యాపారం చేయడమని, కంపెనీల వ్యాపారాన్ని మనం అర్థం చేసుకోవాలని సూచించాడు. చాలామంది పెట్టుబడిదారులు దీర్ఘకాలిక ఆలోచనతో వచ్చినా, తక్కువ సమయంలోనే రోజువారీ ట్రేడింగ్‌కు మారి భావోద్వేగాలకు లోనవుతారని వివరించాడు.స్టాక్ మార్కెట్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులు చాలా ఎక్కువగా ఉంటాయని.. మీరు ఏ పొలిటికల్ లీడర్ లేదా పలువురు సెలబ్రిటీల పోర్ట్‌ఫోలియోలు చూసినా.. అలాగే ఏస్ ఇన్వెస్టర్లను గమనించినా.. వారంతా ఇప్పుడు ధనవంతులుగా మారారు. 20-30 సంవత్సరాల క్రితం కొన్న స్టాక్స్‌ను అట్టిపెట్టుకోవడం ద్వారా ఈ సంపదను సంపాదించారని చెప్పుకొచ్చాడు. ఎణఖీజ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎజూ, టైటాన్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, విప్రో లాంటి స్టాక్స్ కూడా ఒకప్పుడు తక్కువ ధరలో ఉండి, కాలక్రమేణా భారీగా పెరిగాయని చెప్పాడు. స్టాక్ కొనే ముందు, ఆ కంపెనీ, అది పనిచేసే రంగం వృద్ధి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవాలని సూచించాడు. బ్యాంకింగ్ రంగం వంటి పెద్ద సెక్టార్లలో వృద్ధికి ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నాడు. కోవిడ్ సమయంలో తన కుమార్తె డీమ్యాట్ ఖాతాలోని రూ. 2.75 లక్షల విలువైన స్టాక్స్‌ను(డిక్సన్ టెక్నాలజీస్, లారస్ ల్యాబ్స్ లాంటివి) అమ్మేయడంతో ఇప్పుడు రూ. 75 లక్షల విలువైన పోర్ట్‌ఫోలియోను కోల్పోయానని అతడు తెలిపాడు. మంచి స్టాక్స్‌ను కొన్నప్పుడు పానిక్ అవ్వకూడదనేది కచ్చితంగా నేర్చుకోవాల్సిన పాఠం అని చెప్పుకొచ్చాడు.

## నెలకు రూ.12 వేలతో చేతికి రూ.20 లక్షలు..
# ఈ పోస్టాఫీస్ అద్భుత స్కీమ్ గురించి తెలుసా..?









చాలామంది పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలంటే స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని లేదా రిస్క్ తీసుకోవాలని అనుకుంటారు. కానీ ఎటువంటి రిస్క్ లేకుండా ప్రభుత్వ హామీతో చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేస్తూ రూ.20 లక్షల భారీ నిధిని నిర్మించవచ్చని మీకు తెలుసా..? పోస్ట్ ఆఫీస్ అందిస్తున్న రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా ఇది సాధ్యమే. మధ్యతరగతి ప్రజలకు, చిన్న వ్యాపారులకు ఈ పథకం ఒక వరప్రసాదంలా మారింది. ఇది కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చే సురక్షితమైన పొదుపు పథకం. ఇందులో ప్రతి నెలా ఒక నిర్ణీత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కేవలం రూ. 100 తోనే మీరు ఖాతా తెరవవచ్చు. 10 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా ఈ ఖాతా ప్రారంభించవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లల పేరు మీద కూడా పెట్టుబడి పెట్టవచ్చు.

**1 / 5**

వడ్డీ రేటు - కాలపరిమితి: ప్రస్తుతం పోస్ట్ ఆఫీస్ =ఙ పై ప్రభుత్వం 6.7 శాతం వడ్డీని అందిస్తోంది. దీనిని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు. ఈ పథకం ప్రాథమిక కాలపరిమితి 5 సంవత్సరాలు. అయితే మీరు కోరుకుంటే మెచ్యూరిటీ తర్వాత మరో 5 ఏళ్లు పొడిగించుకోవచ్చు.

వడ్డీ రేటు - కాలపరిమితి: ప్రస్తుతం పోస్ట్ ఆఫీస్ =ఙ పై ప్రభుత్వం 6.7 శాతం వడ్డీని అందిస్తోంది. దీనిని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు. ఈ పథకం ప్రాథమిక కాలపరిమితి 5 సంవత్సరాలు. అయితే మీరు కోరుకుంటే మెచ్యూరిటీ తర్వాత మరో 5 ఏళ్లు పొడిగించుకోవచ్చు.

**2 / 5**

రూ. 20 లక్షలు ఎలా..? చిన్న చిన్న మొత్తాలు దీర్ఘకాలంలో ఎలా పెద్ద నిధిగా మారుతాయో ఈ లెక్క చూడండి. మీరు రోజుకు రూ. 400 ఆదా చేస్తే, నెలకు రూ. 12,000 పెట్టుబడి అవుతుంది. అంటే సంవత్సరానికి రూ. 1.44 లక్షలు డిపాజిట్ చేస్తారు. ఇదే విధంగా స్థిరంగా 10 ఏళ్ల పాటు పెట్టుబడి కొనసాగిస్తే, చక్రవడ్డీ ప్రభావంతో మీ పెట్టుబడి, వడ్డీ కలిపి సుమారు రూ. 20 లక్షలకు చేరుకుంటుంది.

**3 / 5**

ఈ పథకం ఎవరికి ప్రత్యేకం: ప్రతి నెలా స్థిరమైన పొదుపు చేయాలనుకునే వారికి, రోజువారీ ఖర్చుల నుండి మిగిలిన చిల్లరను పెద్ద మొత్తంగా మార్చుకోవాలనుకునే వారికి, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా ప్రభుత్వ గ్యారెంటీ కోరుకునే వారికి ఇది మంచి ఆప్షన్.

**4 / 5**

అదనపు ప్రయోజనాలు: ఖాతా తెరిచిన ఒక సంవత్సరం తర్వాత నిబంధనలకు లోబడి మీ డిపాజిట్‌పై రుణం తీసుకోవచ్చు. మీకు ఏదైనా ప్రమాదం జరిగితే మీ డబ్బు సురక్షితంగా మీ కుటుంబానికి అందేలా నామినీ సౌకర్యం ఉంది. పెద్ద మొత్తంలో డబ్బు వెనకేయడానికి ధనవంతులు కావాల్సిన అవసరం లేదు.. ఓర్పు, క్రమశిక్షణ ఉంటే చాలు.

## ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్.. సగం ధరకే ఫోన్లు, ఆఫర్ల వర్షం!




ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్.. సగం ధరకే ఫోన్లు, ఆఫర్ల వర్షం!ఫ్లిప్‌కార్ట్‌లో రిపబ్లిక్ డే సేల్‌లో ప్రారంభం కానుంది.ఆ సేల్ సమయంలో ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లు ఎంపిక చేసిన బ్యాంకుల క్రెడిట్, డెబిట్ కార్డులపై తక్షణ డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, సులభమైన జుువీ× సౌకర్యాలను కూడా పొందారు. ఇది ప్లస్, బ్లాక్ సబ్‌స్క్రైబర్‌లకు ముందస్తు యాక్సెస్‌ను కూడా ఇచ్చింది.. ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్ 2026 జనవరి మూడవ వారంలో ప్రారంభం కానుందని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంలో రాబోయే భారీ సేల్ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేయడానికి ఫ్లిప్‌కార్ట్ ఒక ప్రత్యేక మైక్రోసైట్‌ను కూడా ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ మైక్రోసైట్ ద్వారా కస్టమర్‌లు సేల్‌లో అందుబాటులో ఉన్న డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్‌లు, డీల్‌ల గురించి ముందస్తు అవగాహన పొందే అవకాశం ఉంటుంది. ఈ రిపబ్లిక్ డే సేల్‌లో ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో (ఙఔ) ఇయర్‌బడ్‌లు, టాబ్లెట్‌లు, అలాగే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్‌లు వంటి గృహోపకరణాలు తగ్గింపు ధరలకు లభిస్తాయి. ప్రముఖ బ్రాండ్‌ల ఉత్పత్తులపై భారీ తగ్గింపులు ఉంటాయని ఫ్లిప్‌కార్ట్ సూచించింది. కొత్త సంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ కొనాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా మారుతుంది.ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక మైక్రోసైట్‌లో వెల్లడించిన సమాచారం ప్రకారం, రిపబ్లిక్ డే సేల్ 2026 అధికారికంగా జనవరి 17న ప్రారంభమవుతుంది. అయితే, ఫ్లిప్‌కార్ట్ ప్లస్, ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యత్వాలు కలిగిన కస్టమర్లకు 24 గంటల ముందుగానే సేల్ ఈవెంట్‌కు యాక్సెస్ ఇస్తుంది. అంటే ఈ సబ్‌స్క్రైబర్లు జనవరి 16 నుండే డిస్కౌంట్లు, ఆఫర్‌లను పొందవచ్చు. జనవరి 26న జరుపుకునే భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సేల్ జరుగుతోంది.ఈ సేల్‌లో డిస్కౌంట్‌లతో పాటు, బ్యాంక్ ఆఫర్‌లు కూడా ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. ఎణఖీజ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు 10 శాతం తక్షణ డిస్కౌంట్‌తో పాటు సులభమైన జుువీ× ఎంపికలను అందిస్తారని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. అంతేకాకుండా, ఎంపిక చేసిన బ్యాంకుల డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికి 15 శాతం వరకు తక్షణ డిస్కౌంట్ లభిస్తుంది. వివిధ స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ గాడ్జెట్స్‌పై భారీ ఉడండనున్నట్లు తెలుస్తోంది. అయితే కొన్ని ఫోన్లు, ఇతర ప్రోడక్ట్స్ 50 శాతం డిస్కౌంట్ తో కూడా లభించే అవకాశం ఉంటుంది.

## 5 స్టాక్స్‌తో రూ. 4 కోట్లు..! ఉద్యోగంతో పన్లేదిక.. దెబ్బకు తలరాతే మారుతుంది..



స్టాక్ మార్కెట్‌లో ఎక్కువగా నష్టాలే వస్తాయి. అస్సలు దాని జోలికి వెళ్లకపోవడమే మంచిదని అంటుంటారు. అయితే 90 శాతం మంది నష్టపోవడానికి ట్రేడింగ్ వర్సెస్ ఇన్వెస్టింగ్‌పై అవగాహన లేకపోవడం, మల్టీబ్యాగర్ స్టాక్స్‌ను గుర్తించడం, స్టాప్ లాస్ మరవడం లాంటివి ప్రధాన కారణాలు..స్టాక్ మార్కెట్ అంటేనే చాలామందికి డబ్బు పోతుందనే భయం ఉంటుంది. అయితే లక్ష రూపాయలతో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ మొదలుపెట్టి.. సరైన అవగాహనతో లక్షలు, కోట్లు సంపాదించవచ్చునని బిజినెస్ నిపుణులు అంటున్నారు. స్టాక్ మార్కెట్‌లో 90 శాతం మంది డబ్బు కోల్పోవడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. మార్కెట్‌ను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం, సరైన జ్ఞానం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలని బిజినెస్ నిపుణుడు గణేష్ కుమార్ అట్లూరి అన్నాడు. స్టాక్ మార్కెట్ అంటే వ్యాపారంపై వ్యాపారం చేయడమని, కంపెనీల వ్యాపారాన్ని మనం అర్థం చేసుకోవాలని సూచించాడు. చాలామంది పెట్టుబడిదారులు దీర్ఘకాలిక ఆలోచనతో వచ్చినా, తక్కువ సమయంలోనే రోజువారీ ట్రేడింగ్‌కు మారి భావోద్వేగాలకు లోనవుతారని వివరించాడు.స్టాక్ మార్కెట్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులు చాలా ఎక్కువగా ఉంటాయని.. మీరు ఏ పొలిటికల్ లీడర్ లేదా పలువురు సెలబ్రిటీల పోర్ట్‌ఫోలియోలు చూసినా.. అలాగే ఏస్ ఇన్వెస్టర్లను గమనించినా.. వారంతా ఇప్పుడు ధనవంతులుగా మారారు. 20-30 సంవత్సరాల క్రితం కొన్న స్టాక్స్‌ను అట్టిపెట్టుకోవడం ద్వారా ఈ సంపదను సంపాదించారని చెప్పుకొచ్చాడు. ఎణఖీజ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎజూ, టైటాన్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, విప్రో లాంటి స్టాక్స్ కూడా ఒకప్పుడు తక్కువ ధరలో ఉండి, కాలక్రమేణా భారీగా పెరిగాయని చెప్పాడు. స్టాక్ కొనే ముందు, ఆ కంపెనీ, అది పనిచేసే రంగం వృద్ధి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవాలని సూచించాడు. బ్యాంకింగ్ రంగం వంటి పెద్ద సెక్టార్లలో వృద్ధికి ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నాడు. కోవిడ్ సమయంలో తన కుమార్తె డీమ్యాట్ ఖాతాలోని రూ. 2.75 లక్షల విలువైన స్టాక్స్‌ను(డిక్సన్ టెక్నాలజీస్, లారస్ ల్యాబ్స్ లాంటివి) అమ్మేయడంతో ఇప్పుడు రూ. 75 లక్షల విలువైన పోర్ట్‌ఫోలియోను కోల్పోయానని అతడు తెలిపాడు. మంచి స్టాక్స్‌ను కొన్నప్పుడు పానిక్ అవ్వకూడదనేది కచ్చితంగా నేర్చుకోవాల్సిన పాఠం అని చెప్పుకొచ్చాడు.

## హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లకు బిగ్ అలర్ట్.. జనవరి 11న బ్యాంకు సేవల్లో అంతరాయం!




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన వినియోగదారులకు అలర్ట్ చేసింది. ఎందుకంటే పలు రకాల బ్యాంకు సేవల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు ప్రకటించింది. సిస్టమ్ అప్‌గ్రేడ్ కారణంగా బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే వినియోగదారులకు సందేశాలను కూడా పంపింది. మరి ఏ సమయంలోనో తెలుసుకుందాం.. సాధారణంగా బ్యాంకుల సేవల్లో అప్పుడప్పుడు అంతరాయం కలుగుతుంటుంది. ఎందుకంటే సిస్టమ్ అప్‌గ్రేడ్ కారణంగా కొన్ని గంటల పాటు పలు రకాల బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన వినియోగదారులను అలర్ట్ చేసింది. బ్యాంకు సేవల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపింది. ఈ అంతరాయాలు సాధారణంగా షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ కారణంగా వస్తాయి. దీని గురించి బ్యాంక్ ముందుగానే కస్టమర్‌లకు ాణీూ లేదా ఈమెయిల్ ద్వారా తెలియజేస్తుంది. అందుకే మీ బ్యాంక్ సందేశాలను గమనించడం ముఖ్యం. ఈ సేవలు జనవరి 11వ తేదీన తెల్లవారు జామున 12.00 గంటల నుంచి ఉదయం 2 గంటల (అర్ధరాత్రి) వరకు మొత్తం 2 గంటల పాటు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తెలిపింది. ఈ సమయంలో బ్యాంక్ యాప్‌కు సంబంధించిన సేవలు అందుబాటులో ఉండవని తెలిపింది. ఈ సమయంలో వాట్సాప్ ద్వారా నెట్‌బ్యాంకింగ్ సేవలు, చాట్‌బ్యాంకింగ్‌ను ఉపయోగించుకోవచ్చు. బ్యాంకు సిస్టమ్స్ నిర్వహణలో భాగంగా ఈ రెండు గంటల పాటు బ్యాంకు సేవలకు అంతరాయం ఏర్పడనుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మెయింటెన్స్? పనులతో తమ బ్యాంక్? సేవల్లో ఏర్పడుతున్న అంతరాయాన్ని అర్థం చేసుకోవాలని, దీనిని వినియోగదారులు సహకరించాలని కోరింది. వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం, విశ్వసనీయతను మెరుగుపరచడం, సున్నితమైన బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా మెయింటెనెన్స్? చేపడుతున్నట్లు బ్యాంక్? తెలిపింది.

## 1 లక్షను రూ.64 లక్షలు చేసిన స్టాక్.. నాలుగేళ్లలోనే జాక్‌పాట్ కొట్టేసిన ఇన్వెస్టర్లు!



మల్టీబ్యాగర్ స్టాక్స్ పెట్టుబడిదారులకు మంచి రాబడి ఇస్తాయి. అయితే స్టాక్ మార్కెట్లో మంచి స్థానంలో ఉన్న కంపెనీ తక్కువ సమయంలోనే పెట్టుబడిదారులకు పెద్ద మొత్తంలో రాబడిని అందిస్తాయి. ఈ కంపెనీలో లక్ష రూపాయలు ఉన్న స్టాక్ నాలుగేళ్లలో ఏకంగా 64 లక్షలను చేసింది.. స్టాక్ మార్కెట్లో మంచి స్థానంలో ఉన్న కంపెనీ తక్కువ సమయంలోనే పెట్టుబడిదారులకు గణనీయమైన రాబడిని అందించగలదు. నెట్‌వర్క్ పీపుల్ సర్వీసెస్ టెక్నాలజీస్ విషయంలో కూడా ఇదే జరిగింది. కేవలం నాలుగు సంవత్సరాలలో ఈ కంపెనీ పొజిషనల్ ఇన్వెస్టర్ల సంపదను రూ.1 లక్ష నుండి రూ.64 లక్షలకు పెంచింది. కంపెనీ స్టాక్ జనవరి 2022లో ర్యాలీని ప్రారంభించి ఆగస్టు 2024 వరకు కొనసాగింది. దీని ఫలితంగా ఈ కాలంలో దాని షేరు ధర 16,270 శాతం పెరిగింది. నెట్‌వర్క్ పీపుల్ సర్వీసెస్ టెక్నాలజీ స్టాక్ రికార్డు స్థాయిలో రూ.3,577కి చేరుకుంది. డిసెంబర్ 2022 కంపెనీ స్టాక్‌కు ముఖ్యమైన నెల. ధరలు 90.40 శాతం పెరిగాయి. దీని తర్వాత జూలై 2024లో 65.30 పెరిగాయి.

## వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న మహిళపై కాలనీ వాసుల బెదిరింపు...

### మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ..

**హైదరాబాద్/ఆకాంక్ష జనవరి 12:** హైదరాబాద్ అమీన్‌పూర్‌లో వీధి కుక్కలకు ఆహారం అందిస్తూ దయ చూపిన ప్రతిభ (36) అనే మహిళకు స్థానిక కాలనీ వాసుల నుంచి తీవ్ర బెదిరింపులు ఎదురయ్యాయి. ఎన్‌జిఒ పేరు చెబుతూ "ఇల్లు సీజ్ చేస్తామని ఆమెను బెదిరించిన సంఘటన, మానవత్వానికి ప్రతికూలంగా వెలుగులోకి వచ్చింది.ప్రతిభ ఈ బెదిరింపుల కారణంగా తీవ్ర ఆందోళనలో పడ్డారు. భయంతో ఆమె లైజాల్ మాత్రలు తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.వీధి కుక్కల పట్ల మమకారం చూపే ప్రతిభకు ఎదురవుతున్న ఈ ఘటన స్థానికులతో పాటు సామాజిక మీడియాలో కూడా తీవ్ర చర్చకు కారణమైంది. పౌర హక్కులు, వ్యక్తిగత భద్రత, మరియు జంతు సంరక్షణలో ఎదురయ్యే సమస్యలపై ప్రజలలో తీవ్ర ఆందోళన కలిగింది.ప్రతిభ కుటుంబ సభ్యులు, మిత్రులు ఆమెకు మద్దతుగా ఉండగా, పోలీసుల విధుల గురించి వాస్తవ స్థితిని తెలుసుకునే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వం మరియు పోలీసు అధికారులు ఘటనపై సీరియస్‌గా దృష్టి సారించి, బాధితురాలికి అవసరమైన సహాయం అందించే చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.ఈ ఘటన మరిన్ని చర్చలకు, స్థానిక కమ్యూనిటీల్లో జంతు ప్రేమికులకు భద్రత కల్పించడానికి మరియు వ్యక్తిగత హక్కుల పరిరక్షణపై దృష్టి సారించడానికి కారణమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రతిభ పరిస్థితి ప్రాథమిక వైద్య సహాయంతో కొంత మెరుగైనప్పటికీ, వారి ఆరోగ్యం ఇంకా అస్థిరంగా ఉంది. పోలీసులు ఎన్‌జిఒ సభ్యులను మరియు బెదిరింపులు చేసిన వ్యక్తులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకునే అంశాలను పరిశీలిస్తున్నారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలాన్ని రేపినట్లుగా నివాసితులు, పౌర సంఘాలు మరియు సామాజిక కార్యకర్తలు తెలియజేశారు.

## పులిపాటి నగర్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు...





**ఖమ్మం/ఆకాంక్ష జనవరి 12:** ఖమ్మం నగరంలోని మమతా రోడ్డుపై గల పులిపాటి నగర్--2, 20వ డివిజన్ పరిధిలో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. వీక్షకులను ఆకట్టుకునే విధంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం పట్టణంలో కనీవినీ ఎరుగని రీతిలో సుమారు 326 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు.ఈ ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 నగదు బహుమతులు ప్రకటించారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బహుమతులను రిపబ్లిక్ డే సందర్భంగా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేతుల మీదుగా, తుమ్మల యుగంధర్ ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, ముగ్గుల పోటీలు సాంప్రదాయ సాంస్కృతిని కాపాడడమే కాకుండా మహిళల్లో ఐక్యతను, సామాజిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. అంచనాలకు మించి మహిళలు పాల్గొనడంతో కార్యక్రమం ఘన విజయాన్ని సాధించిందని పేర్కొంటూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు డాక్టర్ పులిపాటి ప్రసాద్, యర్నాటి కోటేశ్వరరావు, ఎర్రబోతుల వెంకటేశ్వర రెడ్డి, మంగపతి వీరారెడ్డి, పట్నాయక్ వెంకటేశ్వర్లు, చింతలపూడి పైడిపల్లి నాగేశ్వరరావు, రామచంద్ర రావు, వీరభద్రరావు, కిలారు నీరజ, బైరెడ్డి శ్రీలత,పుల్లయ్య వెంకటేశ్వరరావు, పీవీ సత్యనారాయణ, తుమ్మటి ప్రభాకర్ రెడ్డి, కొంగర మాధవరావు, సుధాకర్ పుల్లారెడ్డి, పాలవాయి వెంకటేశ్వర్లు, తూనుగుంట్ల సంతోష్ చక్రవర్తి, సిద్ధంశెట్టి శ్రీకాంత్, కోదుమూరు భద్రయ్య, కొదుమూరు జగన్నాథం, కొంకిమళ్ళ మృత్యుంజయ గుప్త, గుమ్మడవెల్లి శ్రీనివాస్, మాశెట్టి వరప్రసాద్, కాజా వెంకటేశ్వర్లు, వందనపు సామ్రాట్ గుప్తా, పులిపాటి నగర్ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులుగా కుంచపు కుమార్...



**ఖమ్మం/ఆకాంక్ష జనవరి 12:** వడ్డెర సంక్షేమ సంఘం ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులుగా కుంచపు కుమారు నియమితులయ్యారు. సోమవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఖమ్మం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల వీర బాబు నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కుంచపు కుమార్ మాట్లాడుతూ తనను గుర్తించి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వడ్డెరలను కలుపుకుపోయి వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, సంఘం సీనియర్ సలహాదారులు వలపు సోమరాజు, సలహాదారులు దేరంగుల బ్రహ్మం, నర్రా ఎల్లయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సంపంగి మల్లయ్య గొడ్డెండ్ల రాము, పల్లపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏబివిపి ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం...




**హైదరాబాద్/ఆకాంక్ష జనవరి 12:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163 వ జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా సికింద్రాబాద్ లోని మడ్ఫోర్ట్ కంటోన్మెంట్ బస్తీలో ఉచిత దంత వైద్య శిబిరం కార్యక్రమంను ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు డా:ఎన్ జానా రెడ్డి ప్రారంభించారు. తదనంతరం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైద్యుల బృందం డా:పరశురామ్ మరియు డా:వినూత్న రెడ్డి ఈ కార్యక్రమానికి విచ్చేసి సుమారు 150 మంది బస్తీవాసులకు తమ సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ కార్యవర్గ సభ్యులు డా:ఎన్ జానారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని లే మేలుకో నీ గమ్యం చేరేవరకు విశ్రమించకు అని అనునిత్యం యువతను ప్రేరేపించే మహోన్నతమైన వ్యక్తి స్వామి వివేకానంద అని వారిని ఆదర్శంగా తీసుకుంటూ మనమందరం ముందుకు వెళ్లాలని ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైద్యులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జీయమనిస్తారని అన్నారు ఈ కార్యక్రమాన్ని పిలువగానే విచ్చేసినటువంటి వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు... యువత మత్తుకు మద్యానికి దూరం విడిచి దేశం కోసం పనిచేసే విధంగా స్వామి వివేకానంద బాటలో నడవాలని కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు విద్యార్థి సమస్యలు కాకుండా అదేవిధంగా సమాజంలో సమస్యల పైన కూడా నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్నారు ఈ దంత వైద్య శిబిరం బస్తీలలోనిర్వహించినా ఏబివిపి సికింద్రాబాద్ జిల్లాకి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ గారు, ఎస్ఎఫ్డి సిటీ కన్వీనర్ పాండురంగ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్,పవన్, విజయ్, అభి, దేవేందర్ తదితరులు పాల్గొనడం జరిగింది

## తలసాని కేసీఆర్ కుటుంబానికి గుమస్తా...

### తలసానికి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి కాదు...

### మెట్టు సాయికుమార్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్...



**హైదరాబాద్/ఆకాంక్ష జనవరి 12:** తలసాని కేసీఆర్ కుటుంబానికి గుమస్తా అని, తలసానికి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి లేదని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు.సామవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ అతన్ని వసూల్ రాజా అని అంటారు అందుకే ఆయన తలసాని తన దందాలు, వసూళ్లను మర్చిపోవాలన్నారు.ఆయన తలసాని శ్రీనివాస్ యాదవ్ కాదు ఆయన తలసాని శ్రీనివాస్ రావు..తలసానికి దమ్ములేదు, రేవంత్ ను టచ్ చేయడం కాదు రేవంత్ కటవుట్ ను కూడా ఏం చేయలేరన్నారు.దమ్కీలు, డాగులకు బయటపడడానికి రేవంత్ రెడ్డి... కేసీఆర్ లాంటి వాడు కాదు రేవంత్ రెడ్డి తెలంగాణని పునర్నిర్మాణం చేస్తున్నాడు సికింద్రాబాద్, సనత్ నగర్ లకు తలసాని చేసింది ఏంటో చెప్పాలిముక్కలు చేస్తామని చెప్తున్న తలసాని బూడిద కాక తప్పదు తలసాని మాటలను సుమోటోగా తీసుకొని అరెస్ట్ చేయాలి సనత్ నగర్ కు పట్టిన చీడా,పీడా అన్నారు.

# ఈనెల 20న కళాకారుల చలో హైదరాబాద్...

### నిరుద్యోగ కళాకారులకు తక్షణమే సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి...

### పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్...




**హైదరాబాద్/ఆకాంక్ష జనవరి 12:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తమ ఆటపాటలతో ఊరురా ధూంధాం నిర్వహించి తెలంగాణ భావజాలాన్ని పల్లె పల్లెకు తీసుకువెళ్లిన కళాకారుల కు తక్షణమే తెలంగాణ సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, డిమాండ్ చేశారు నేడు హైదరాబాదులోని బీసీ భవన్ లో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20 వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్, కళాకారుల పోరు దీక్ష వాల్ పోస్టర్ ను తెలంగాణ ఉద్యమ కళాకారుల తో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం కేవలం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతోనే పల్లె పల్లెకు విస్తరించిందని, కళాకారుల త్యాగాలతో వచ్చిన తెలంగాణలో కళాకారులను ఆదుకోవలసిన ప్రభుత్వాలు ఆదుకోకపోవడంతో వందలాదిమంది కళాకారుల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు గత ప్రభుత్వంలో కళాకారులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతాదని ఆశించిన కళాకారులకు నేడు నిరాశే మిగిలిందని కళాకారులకు తెలంగాణ సారధిలో ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నప్పటికీ తన బాధ్యతను విస్మరిస్తుందని ఆయన మండిపడ్డారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావులో తక్షణమే జోక్యం చేసుకొని నిరుద్యోగ కళాకారులకు ఆదుకోవాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం వ్యవస్థాపకులు అనుమోజు వెంకటేశం మాట్లాడుతూ కళాకారుల హక్కుల కోసం ఈనెల 20వ తేదీన హైదరాబాదులోని ఇంద్ర పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు కళాకారుల ఊరు పోరు దీక్ష చేపట్టామని ఈ ఆందోళన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ కళాకారులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జువాజి ప్రవీణ్, కొంద్ర కుమార్, హైమత్, పి రమేష్, కొత్త నరసింహస్వామి, గూడూరు భాస్కర్, బండి గారు రాజు, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు...

### కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు...



**ఖమ్మం/ఆకాంక్ష జనవరి 12:** స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఖమ్మం ఇల్లందు క్రాస్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించిన బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు. ఈ సందర్భంగా వాసుదేవ రావు మాట్లాడుతూ."లేచి నిలబడు, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగవద్దు" అనే వివేకానంద సందేశాన్ని స్మరించుకుంటూ,యువతలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, దేశభక్తి భావాలు పెంపొందించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.ప్రపంచ సర్వమత సమ్మేళనంలో భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందుల మహత్తును వివరించారు. భారతదేశాన్ని తక్కువగా చూసే వారి కళ్ళు తెరిపించిన ఆయన ఆలోచనలు విద్యార్థుల్లో గర్వభావాన్ని నింపాయి అన్నారు.అదేవిధంగా వైరా రోడ్డు లోని వీఐహెచ్ఇ సిటీ క్యాంపస్‌లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించి, స్వామివారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్ట్ అఫ్ లివింగ్ ఇంట్యూషన్ ప్రోగ్రాం విద్యార్థులకు స్వామి వివేకానందుల జీవితం, ఆలోచనలు, భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఆయన మహత్తు గురించి అవగాహన కల్పించారు. వీఐహెచ్ఇ గురుదక్షిణ క్యాంపస్, పోలేపల్లి నందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడంతో పాటు, వీఐహెచ్ఇ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి మాట్లాడారు.యువతే దేశ భవిష్యత్తు అని నమ్మిన స్వామి వివేకానంద ఆదర్శాలను ప్రతి ఒక్కరూ జీవితంలో అమలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బోనాల రామకృష్ణ వీఐహెచ్ఇ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జయంత్ లాల్ పటేల్, కేశవ్ లాల్ పటేల్,నున్న రవికుమార్, వెంకటనారాయణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువజన ఉత్సవ వేడుకలు...



**హైదరాబాద్/ ఆకాంక్ష జనవరి 12:** వివేకానంద స్వామి పుట్టినరోజు సందర్భంగా యువజన ఉత్సవ వేడుకలు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీస్ లిబర్టీ ప్లాజా బషీర్బాగ్ హైదరాబాద్ నందు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామి వివేకానంద బోధనలను వాటి ప్రాముఖ్యతను వక్తలు వివరించారు ముఖ్యఅతిథిగా శ్రీ నారగోని చైర్మన్ పొలిటికల్ జస్టిస్ ఫ్రాంట్ గౌరవ అతిథులుగా కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు విశిష్ట అతిథులుగా సుధాకర్ చిత్ర వేణుగోపాల్ నాదెండ్ల సుధాకర్ డాక్టర్ పద్మిని విజయ కనకదుర్గ సరిత తదితరులు పాల్గొన్నారు

## కులాంతర వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండ...

### ఎంపీ డాక్టర్ మల్లు రవి...



**నాగర్ కర్నూల్/ఆకాంక్ష జనవరి 12:** రాష్ట్రంలో కుల వ్యవస్థ కారణంగా ఏర్పడిన సామాజిక విభేదాలను తొలగించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి తెలిపారు. కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ పూర్తిగా వినియోగించు కోవాలని ఆయన సూచించారు. సోమవారం నాగర్ కర్నూల్ ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కులాంతర వివాహాలు చేసుకున్న ఐదు జంటలకు ప్రోత్సాహక బహుమతుల చెక్కులను ఎంపీ డాక్టర్ మల్లు రవి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌లతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కులాంతర వివాహాలు సామాజిక సమానత్వానికి దోహద పడతాయని, ఇలాంటి వివాహాలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందన్నారు.



ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివాహాల ప్రోత్సాహక పథకం కింద ఒక్కో జంటకు రూ.2 లక్షల 50 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.ప్రోత్సాహక బహుమతులు అందుకున్న జంటలలో సి. అనితరాము, వి. లలిత నిమ్మల రాజకుమార్, కిరణ్ లాల్చంద్ కల్బుత్, మునగర శ్రీకాంత్ గువ్వల శ్రీదేవి, చంద్రశేఖర్ పి. తిరుపతి లక్ష్మీ ప్రసన్న, పి. శారద నాగరాజు ఉన్నారు. ఎంపీ లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. అమరేందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం కార్యాచరణలో వ్యవసాయ అనుబంధ శాఖలు భాగస్వామ్యం కావాలి...



**నాగర్‌కర్నూల్ టౌన్/ ఆకాంక్ష జనవరి 12:** మండల పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పాలెంలో సోమవారం జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీదేవి అధ్యక్షత వహించగా, దక్షిణ తెలంగాణ మండలం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్. కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎల్. కృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించే కార్యక్రమాల్లో వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అనంతరం కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీదేవి మాట్లాడుతూ గత ఏడాది అమలు చేసిన సాంకేతిక కార్యక్రమాలు, ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనలు, మినీ కిట్స్ ఫలితాలను సమగ్ర నివేదిక రూపంలో వివరించారు. రానున్న 2026--27 సంవత్సరానికి చేపట్టబోయే కార్యక్రమాలపై ఆదర్శ రైతులు, జిల్లా అధికార యంత్రాంగం నుంచి సలహాలు, సూచనలు సేకరించామని తెలిపారు. వ్యవసాయ ఆధునికరణలో డ్రోన్‌ల వంటి ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కేవీకే చేపట్టే కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా మత్స్య శాఖ అధికారి నర్సింహారావు మాట్లాడుతూ నీటి కుంటల్లో చేపల పెంపకం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చని సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం. వెంకటేశం మామిడి తోటల్లో అల్లం వంటి అంతర్ పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. జిల్లా నాబార్డ్ అధికారి మనోహర్ రెడ్డి రైతులు పెద్ద ఎత్తున కూరగాయల సాగు చేపడితే అధిక ఉత్పత్తి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. డీఈ నామిని, సీనియర్ ప్రొఫెసర్ సిహెచ్. పద్మవేణి రైతుల పొలాల్లో వివిధ రకాల వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి శ్రీశైలం గౌడ్, జిల్లా పశుసంవర్ధక అధికారి జ్ఞాన శేఖర్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, రైతులు లక్ష్మీ చంద్రయ్య, నరసింహారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిశంకర్, శైల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆకాశయానంలో అదానీ ఆధిపత్యం

### అదానీ సమూహం ఆపరేట్ చేస్తున్న విమానాశ్రయాలకు ట్రాఫిక్‌ను పెంచాలన్న లక్ష్యంతో విదేశీ విమాన సంస్థలకు ఎక్కువ ఎగుమతి హక్కులు అనే కోరికను, మోదీ ప్రభుత్వం ఎదుట అదానీ గ్రూప్ ఒక వ్యూహాత్మక డిమాండ్‌ను పెట్టింది.




**ఆకాశయానంలో అదానీ ఆధిపత్యం**

అదానీ సమూహం ఆపరేట్ చేస్తున్న విమానాశ్రయాలకు ట్రాఫిక్‌ను పెంచాలన్న లక్ష్యంతో విదేశీ విమాన సంస్థలకు ఎక్కువ ఎగుమతి హక్కులు అనే కోరికను, మోదీ ప్రభుత్వం ఎదుట అదానీ గ్రూప్ ఒక వ్యూహాత్మక డిమాండ్‌ను పెట్టింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్లై దుబాయ్ వంటి వాయుయాన సంస్థలకు మరిన్ని సీట్లను విడుదల చేయాలని, ఇందులో యుఎఇ, సౌదీ అరేబియా, ఖతార్, సింగపూర్, ఇండోనేషియా, మలేషియాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను వేగవంతం చేయాలని అదానీ గ్రూప్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇది భారతదేశానికి చెందిన రెండు అతి పెద్ద ఎయిర్లైన్స్ సంస్థలు, విమానాశ్రయాలు పెట్టుబడిదారుల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడటానికి దారితీసింది. మూడు మూల శక్తుల మధ్య ఘర్షణను పరిశీలిద్దాం.

**అదానీ గ్రూప్**

భారతదేశంలోని ఎనిమిది ప్రైవేట్ విమానాశ్రయాలను ఆపరేట్ చేస్తూ, 2030 నాటికి టెర్మినల్స్, రన్వేలు, ప్రయాణికుల సదుపాయాల కోసం 11.1 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని ఈ గ్రూప్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పెద్ద పెట్టుబడులకు సరిపడా ట్రాఫిక్ లభించాలని ఆసక్తి కలిగి ఉంది. ప్రయాణికులకు మరిన్ని ప్రత్యామ్నాయాలు, సౌకర్యాలు అందించడం భారతీయ విమానాశ్రయాలను ప్రపంచస్థాయి హబ్బులుగా మార్చడానికి కీలకంగా పని చేస్తామ"ని అదానీ గ్రూప్ చెప్పుతుంది. ఇది కేవలం భారతీయ ఎయిర్లైన్స్‌కు పోటీకి సిద్ధంగా ఉన్నాయా లేదా అనే దానిపై ఆధారపడి ఉండకూడదు అని అదానీ గ్రూప్ కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. విమానాశ్రయాల సామర్థ్యాన్ని వృథ చేయడం నేరపూరితమైన వ్యర్థంగా వారు భావిస్తున్నారు.

**ఎయిర్ ఇండియా, ఇండిగో**

వారి వ్యాపార ప్రయోజనాల కోసం విదేశీ ఎయిర్లైన్స్ ముందుకు రాకుండా కాపాడుకోవాలని ఇవి ఆసక్తి కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి పశ్చిమ ఆసియా ఎయిర్లైన్స్, వారి ప్రభుత్వాల నుంచి అపారమైన నగదు మద్దతు, రాయితీలతో పోటీ చేస్తే, అది అన్యాయమైన పోటీగా భావిస్తున్నాయి. విదేశీ ఎయిర్లైన్స్ తీసుకెళ్లే వారికన్నా 70 శాతం కంటే ఎక్కువగా భారతీయ ప్రయాణికులు ఇతర దేశాలకు వెళ్లేవారని, ఆ ఆదాయం భారత సంస్థలకు దక్కకుండా పోతుందని ఎయిర్ ఇండియా సీఈఓ క్యాంప్బెల్ విల్సన్ వాదించారు.

**కేంద్ర ప్రభుత్వం**

దేశీయ ఎయిర్లైన్స్ పెట్టుబడులను కాపాడటం, అభివృద్ధి చేయడం, విమానాశ్రయాల పెట్టుబడులను వృథ చేయకుండా చూసుకోవడం, ప్రయాణికులకు సరసమైన ధరలను కొనసాగించడం వంటి బహుళ లక్ష్యాలను సమతుల్యం చేయాల్సి ఉంది. 2016 జాతీయ పౌర విమానయాన విధానం, భారతీయ ఎయిర్లైన్స్ తమ ఎగుమతి హక్కులలో 80 శాతం ఉపయోగించిన తర్వాతే అదనపు హక్కులు మంజూరు చేయాలని నియమం చేస్తుంది.

**నివేదిక ఏం చెపుతోంది**

ఈ చర్చ ఒక సాధారణ వ్యాపార వివాదం కంటే ఎక్కువ. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం, పెద్ద వ్యాపార సంస్థలు మరియు జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల మధ్య సంక్లిష్ట సంబంధాన్ని చిత్రీకరిస్తుంది. ఈ వ్యాజ్యంలో, ప్రభుత్వం ఏ పక్షానికి మద్దతు ఇస్తుందో తెలియదు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిమాణామాల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం తన మిత్రుడు అయిన అదానీ గ్రూప్ వైపే మొగ్గు చూపే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే భారత దేశంలో అన్ని ఆర్థిక వనరులపై, ప్రకృతి సంపదపై ఆధిపత్యం చెలాయించటానికి, అదానీ గ్రూప్ వేగవంతమైన అభివృద్ధి వెనుక అండగా నిలబడింది ప్రధాన మంత్రి హోదాలో పనిచేస్తున్న మోదీ కనుక సహజంగానే ఇలాంటి అభిప్రాయం కలుగుతుంది. అదానీ పురోభివృద్ధి కోసం ఎంతకైనా తెగించే లక్షణం మోదీకి ఉన్నట్లు గత 11 ఏళ్ళ చరిత్ర సాక్ష్యం చెబుతుంది.

## భారీ అగ్నిప్రమాదం.. పండగవేళ నిరాశ్రయులైన 120 మంది

### గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంతో పండగ వేళ 120 మంది నిరాశ్రయులయ్యారు...

భారీ అగ్నిప్రమాదం.. పండగవేళ నిరాశ్రయులైన 120 మంది

పండగ వేళ 120 మంది నిరాశ్రయులయ్యారు. మొత్తం 38 పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన కాకినాడ జిలా రౌతులపూడి మండలం సార్లంక లో జరిగింది. గ్రామంలో మూడు ఇళ్లు మినహా అని పూరిగెడిసెలు అగ్నికి ఆహుతయ్యారు. సంక్రాంతి నేపథ్యంలో కొనుగోళ్ల కోసం గ్రామస్తులు తునికి వెళ్లారు. ఈ సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. అయితే గ్రామంలో ఉన్న కొందరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కాకపోతే తుని నుంచి ఫైరింజన్లు రావడానికి చాలా సమయం పట్టింది.

# తుది ఓటరు జాబితా విడుదల...



గోదావరిఖని/**ఆకాంక్ష జనవరి 12:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా రామగుండం నగర పాలక సంస్థ తుది ఓటరు జాబితాను సోమవారం అధికారికంగా ప్రచురించింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆదేశాల మేరకు, నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ నేతృత్వంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, ఆర్ఓ ఆంజనేయులు, ఆర్ఐలు శంకర్ రావు, ఖాజా, టీపిబీఓలు హిమజ, సిందూజ తదితరులు పాల్గొని తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు.నగర పరిధిలోని మొత్తం 60 డివిజన్లలో కలిపి 1,83,049 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో పురుష ఓటర్లు 91,441 మంది,మహిళా ఓటర్లు 91,578 మంది కాగా, ఇతరులు 30 మంది ఉన్నారు. తుది జాబితా ప్రచురణతో ఎన్నికల ప్రక్రియలో కీలకమైన దశ పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రజలు తమ పేర్లు, వివరాలు ఓటరు జాబితాలో సరిచూసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

# నిజాయితీకి ప్రతీకగా నిలిచిన ఆటో డ్రైవర్...

బంగారం, రూ.5000 నగదు ఉన్న బ్యాగును కాపాడిన శేఖర్



ఓదెల/**ఆకాంక్ష జనవరి 12:** ఓదెల మండలం పోత్కపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చెరుకు శేఖర్ మానవత్వానికి మారు పునాదిగా నిలిచారు. మందమర్రి నుంచి పోత్కపల్లికి సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చిన ఇద్దరు ప్రయాణికులు, అక్కడి నుంచి ఇందుర్తి గ్రామానికి వెళ్లేందుకు చెరుకు శేఖర్‌కు చెందిన ఆటోను అద్దెకు తీసుకున్నారు.ప్రయాణం ముగిసిన తర్వాత, వారు తమ బ్యాగును ఆటోలోనే మర్చిపోయారని తెలుసుకున్నారు. తిరిగి పోత్కపల్లికి వచ్చి ఆటోను పరిశీలించగా, ఆటో యూనియన్ అధ్యక్షుడు రంగు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో ఉన్న బ్యాగును తెరిచి చూశారు, అందులో నాలుగు తులాల బంగారం మరియు రూ.5000 నగదు ఉన్నట్లు గుర్తించారు.వేగంగా చర్య తీసుకున్న చెరుకు శేఖర్, ఆ బ్యాగును యజమానులకు యథవిధిగా అప్పగించారు. ఈ సంఘటనతో ప్రయాణికులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు మరియు చెరుకు శేఖర్ మానవత్వాన్ని ప్రశంసించారు.నిజాయితీ,మానవత్వానికి ప్రతీకగా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శనిగరపు రమేష్ చెరుకు శేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగు ఆనంద్ గౌడ్, రెడ్డి బాబు రావు, యూసుఫ్ పాషా, ఫిరోజ్, రెవెల్లి సారయ్య, రాసపెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.ఓదెలలోని స్థానిక ప్రజలు చెరుకు శేఖర్ నిజాయితీతో చేసిన ఈ గొప్ప పని గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. నిజాయితీ, సదాచారం మరియు మానవత్వం విలువలను ప్రతిఫలింపజేసిన ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లోనూ విపరీతంగా చర్చనీయాంశంగా మారింది. ఓదెలలోని ప్రజల హృదయాల్లో చెరుకు శేఖర్ నిజాయితీ, మనవత్వానికి ప్రతీకగా నిలిచాడు. ఆటో డ్రైవర్ ఇలాంటి నిజాయితీకి ప్రేరణగా మారడం స్థానిక సమాజానికి గర్వకారణం అయ్యింది.ఈ ఘటన ద్వారా స్థానికులు, యువత, మున్సిపల్, రాజకీయ నాయకులు నిజాయితీ, సేవా భావనలతో ఉంటే సమాజం ఎలా మారుతుందో ప్రత్యక్షంగా చూశారు. చెరుకు శేఖర్ మానవత్వం ప్రదర్శన స్థానికులకు ఉదాహరణగా నిలిచింది.

# సమాజంలో మీడియా పాత్ర గొప్పది...

ప్రజలను చైతన్యపరిచేది మీడియా రంగం...

కలెక్టర్ బాదావత్ సంతోష్...



నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 12:** సమాజంలో మీడియా పాత్ర గొప్పదని ప్రజలను చైతన్యపరిచేది మీడియా రంగమే అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బధావత్ సంతోష్ అన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో 19 టీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో మీడియా పాత్ర కీలకమైనదని, 19 టీవీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా ప్రజలందరికీ మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( ఎ-143) జాతీయ నాయకులు జెమినీ సురేష్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు కానాపురం ప్రదీప్, టి యు డబ్ల్యు జే (హెచ్ 143)రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, 99 టీవీ ప్రతినిధి ప్రదీప్, మెగా9 టీవీ ప్రతినిధి రామకృష్ణ, దిశ బాలు, మహ్మద్, 19 టీవీ సీఈవో శేఖర్, నరేందర్ గౌడ్, మణికిషోర్ తోపాటు సీనియర్ జర్నలిస్టులు, వివిధ ఛానల్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహనీయుల పేర్లు పెట్టాల్సిందే...

అగ్రకులాల పేర్లకే పరిమితం కావొద్దు...

పెద్దపల్లి బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్...



పెద్దపల్లిటౌన్/**ఆకాంక్ష జనవరి 12:** రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో కేవలం అగ్రకుల నేతల పేర్లకే పరిమితం కాకుండా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బీసీ మహనీయుల పేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పెద్దపల్లి బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలో విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడారు.?గత ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాలను విభజించిందని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని సరిదిద్ది, ప్రజాభీష్టం మేరకు పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. అయితే, కొత్తగా ఏర్పాటు చేసే లేదా మార్పులు చేసే జిల్లాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వంటి బీసీ ఉద్యమకారుల పేర్లు పెట్టాలని ఆయన కోరారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాకుండా, సామాజిక న్యాయం పాటించాలన్నారు. బీసీ మహనీయుల పేర్లను విస్మరిస్తే, బీసీలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# చివరి ఆయకట్టుకు నీరందక రైతుల అవస్థలు...

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల

స్వామి వివేక్ పటేల్ డిమాండ్...



పెద్దపల్లిటౌన్/**ఆకాంక్ష జనవరి 12:** ఎస్సారెస్పీ డీ--83 ఉపకాల్వ ఆర్ఎస్‌డీ4ను వెంటనే మరమ్మత్తులు చేపట్టి కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చిట్టచివరి గ్రామాలైన జాఫర్‌ఖాన్‌పేట, పెద్దరాతిపల్లి, ఇద్దులాపూర్ రైతులకు ఎస్సారెస్పీ సాగు నీరు అందడం లేదని, ఉపకాల్వకు మరమ్మత్తులు చేపట్టి, పిచ్చిమొక్కలను తొలగించి రెండోవిడుతలోనైనా నీళ్లు అందేలా చూడాలని అధికారులను విజఅబశ్రీశ్రీప్తి చేశారు. స్వామి వివేక్‌పటేల్‌తో పాటు బీసీ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ రాజేందర్‌నేత మరియు పలువురు రైతులున్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు...

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు..

విజేతలకు బహుమతుల ప్రదానం...



పెద్దపల్లిటౌన్/**ఆకాంక్ష జనవరి 12:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ప్రఖండ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు, భోగి పళ్ల వేడుకలు వైభవంగా జరిగాయి.?అలరించిన ముగ్గుల పోటీలు

మహిళల సృజనాత్మకతను వెలికితీసేలా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు రంగురంగుల రంగవల్లులతో పోటీపడ్డారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆకేనపెల్లి విజయ రాణి, శ్రీమతి వేల్పురి వాసంతి, శ్రీమతి మంచాల జ్యోతి వ్యవహరించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు.?సంప్రదాయ బద్ధంగా భోగి పళ్లు అనంతరం చిన్నారులకు సంప్రదాయబద్ధంగా భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. మన సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలు, పండుగల విశిష్టతను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.?పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి ప్రఖండ సంయోజకురాలు శ్రీమతి మూల కవిత, సత్సంగ్ ప్రముఖ్ మంతెన వేదశ్రీ, సహసంయోజకురాలు శ్రీమతి అలివేలు (రంగవాణి), బాల సంస్కార్ ప్రముఖ్ శ్రీమతి శ్రీదేవి పర్యవేక్షించగా, ముఖ్య అతిథిగా జిల్లా సంయోజిక తారాబాయి హాజరయ్యారు. కార్యక్రమంలో సత్సంగ్ ప్రముఖ్ బొమ్మకంటి రవి, సహకార్యదర్శి మురళి, బజరంగ్ దళ్ నాయకులు రాజకుమార్, మణిదీప్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి కార్యాలయంలో

# ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు...



హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 12:** తెలంగాణ జాగృతి కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ వివేకానందుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో జాగృతి సంస్థ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేవండి మేల్కొండి గమ్యాన్ని చేరే వరకు విశ్రమించకండి...

యువతకు మాదారం రాము కుమార్ పిలుపు...



హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 12:** లేవండి! మేల్కొండి! గమ్యాన్ని చేరే వరకు విశ్రమించకండి..అంటూ యువతకు కెసిఆర్ సేవా దళం నేత మాదారం రాము కుమార్ పిలుపు నిచ్చారు . శ్రీ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను కార్యసాధనకు ఉసిగొలిపే ఇటువంటి అద్భుత సందేశాలను ఎన్నింటినో ప్రపంచానికి అందించిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పించారు. నిరంతరం వెలిగే సూర్యుడిని చూసి చీకటి భయపడినట్టే, నిత్యం శ్రమించే వారిని చూసి ఓటమి తప్పుకుంటుంది.భారతీయ యువతకు స్ఫూర్తిదాత, ఆదర్శ ప్రాయుడు శ్రీ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆరు నెలల బాలికను పక్కింటి వ్యక్తి కిడ్నాప్..

బాలికపై అత్యాచారం..గొంతు కోసి హత్య...

బెంగళూరు/**ఆకాంక్ష జనవరి 12:** ఆరు నెలల బాలికను పక్కింటి వ్యక్తి కిడ్నాప్ చేశారు. బాలికపై అత్యాచారం చేసి గొంతు కోసి హత్య చేసి మురికి కాలువలో పడేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కర్నాటక రాష్ట్రం బెంగళూరులో జరిగింది. నల్లురహళ్లి ప్రాంతంలో యుషఫ్ ఖాన్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. పక్కింట్లో ఉండే మహిళతో యుషఫ్ ఖాన్ పలుమార్లు గొడవకు దిగాడు. ఇద్దరు మధ్య గొడవలు తారాస్థాయికి చేరుకొని మహిళ కుటుంబంపై యుషఫ్ పగ పెంచుకున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో బాలికను కిడ్నాప్ చేశాడు. అనంతరం బాలికపై అత్యాచారం చేసి గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని దేవాలయం పక్క ఉన్న మురికి కాలువలో పడేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవ పరీక్షలో బాలికపై అత్యాచారం జరిగినట్టు తేలింది. పక్కింటి వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కటక్ రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రజా భవన్‌లో బాల భరోసా

# పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి...

దివ్యాంగులను ఇతరులు ,దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సాయం...

ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు...

కార్పొరేషన్‌లో, మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను నామినేట్...



హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 12:** ప్రజా భవన్‌లో బాల భరోసా పథకాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తున్నామని.. రూ.50 కోట్లతో దివ్యాంగులకు పరికరాలు అందించామని తెలిపారు. దివ్యాంగులను దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులను ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన దివ్యాంగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించుకొని దివ్యాంగులు ఎదగాలని రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో దివ్యాంగులకు స్ఫూర్తి జైపాల్ రెడ్డి అని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్‌లో, మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను నామినేట్ చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లు వాళ్ల సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలని అన్నారు. ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తామని హెచ్చరించారు. బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు తీసుకొస్తున్నామన్నారు. "తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిని మనమే దారిలోకి తీసుకురావాలి. తల్లిదండ్రులపై బాధ్యత లేని వారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుంద" అని సిఎం రేవంత్ అన్నారు.ద

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై ముఖ్యమైన ఆదేశాలు...

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్...

ఎన్నికల సన్నద్ధతపై పునర్మూల్యాంకనం...

రాజన్న సిరిసిల్ల/**ఆకాంక్ష జనవరి 12:** రాష్ట్రం మొత్తంలో మున్సిపల్ ఎన్నికలను సమగ్రంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్య కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు.హైదరాబాద్‌లోని కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు సమర్థమైన శిక్షణ ఇవ్వడం, తగినంత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారో పరిశీలించడం, ఎన్నికల సామగ్రి సమకూర్చుకోవడం వంటి అంశాలను సవివరంగా చర్చించారు. సీఎస్ రామకృష్ణారావు వివరించిన ప్రకారం, ఎఫ్ఎస్టీ (ఖీూ), ఎస్ ఎస్ టీ (ూూ) బృందాల ఏర్పాట్లకు కచ్చితమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్లు ఫొటో ఎలక్టోరల్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వాహణలో అవసరమైన ఇతర అంశాలపై వివరాలను సిఎస్‌కు నివేదించారు. కలెక్టరేట్ సమావేశం నుండి ఇన్-చార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, అధికారుల నియమాకానికి సంబంధించి తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని, సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో లోటు పొరపాట్లను నివారించమని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్, డీఈవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖాదీర్ పాషా, అన్వేష్, ఎన్నికల విభాగం అధికారులు ప్రవీణ్, అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.సిఎస్ రామకృష్ణారావు ఈ సమావేశంలో ప్రతీ జిల్లాకి ప్రత్యేక దృష్టి పెట్టి, ఎన్నికల నిర్వహణలో లోపాలు రాకుండా పర్యవేక్షించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై సమగ్ర సమీక్ష చేపట్టి, ప్రతి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యేలా అధికారులు దృష్టి పెట్టారు.సమగ్ర ఏర్పాట్లతో, ప్రజలకు న్యాయమైన, పారదర్శకమైన, మరియు సజావుగా ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడుతున్నదని అధికారులు తెలిపారు.

## ఆభరణాల మెరుగు చేస్తామని

# మోసిన ఇద్దరు వ్యక్తులు పై కేసు నమోదు...

రాజన్న సిరిసిల్ల/**ఆకాంక్ష జనవరి 12:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామంలో వయస్సు 27 సంవత్సరాల మాదాసు మాన్యలక్ష్మి, భర్త సత్తయ్యకు చెందిన వెండి ఆభరణాలతో మోసపాటు జరగడం కలకలం రేపింది. ఈ ఘటన ఈ రోజు, జనవరి 12, 2026 లో చోటు చేసుకుంది.ప్రమాద వివరాల ప్రకారం, ఫిర్యాదిత మాన్యలక్ష్మి ఇంటి వద్ద ఇద్దరు వ్యక్తులు వచ్చి, ఫిర్యాదితతో పాటు గ్రామస్తులైన తలారి పద్మ, బడే ప్రేమల, మాదాసు సత్తవ్వల వద్ద ఉన్న వెండి ఆభరణాలను మెరుగులు చేస్తామని చెప్పి తీసుకున్నారు. నమ్మి, ఆభరణాలను ఒక లిక్విడ్‌లో వేసి పౌడర్ చల్లిన తర్వాత కొద్దిసేపటి తరువాత వెండి ఆభరణాల బరువు సగం పైగా తగ్గిపోయినట్లు తెలుస్తోంది.పోలీసుల వివరాల ప్రకారం, మోసం చేసిన వ్యక్తులు బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేష్ కుమార్ మరియు కన్నయ్య కుమారులు. వీరి పై ఎల్లారెడ్డిపేట ఎస్సై కె.రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.ప్రాంత ప్రజల్లో ఈ ఘటన గట్టి చర్చకు కారణమైంది. వెండి ఆభరణాలను మెరుగులు చేస్తానని వాగ్దానం చేసిన నిపుణులు ఇలా మోసం చేయడం ప్రజలకు భయానకంగా భావింపబడుతోంది. పోలీసులు ఆ వ్యక్తులను త్వరలో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# "నో హెల్మెట్.. నో పెట్రోలు...

పెట్రోల్ బంక్ యజమానులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు...

రాజన్న సిరిసిల్ల/**ఆకాంక్ష జనవరి 12:** రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ యజమానులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇచ్చిన సమాచారం ప్రకారం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశంలో గత ఏడాదిలో 4,80,000 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని, ఇందులో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి రోజు సుమారు 20 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, మరియు జిల్లాలోనే గత ఏడాదిలో 290 ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వివరించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలను హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, వాహనదారులు క్రమశిక్షణతో వాహనాలను నడపడం ద్వారా ఈ ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పెట్రోల్ బంక్ యజమానులకు సామాజిక బాధ్యతగా "నో హెల్మెట్.. నో పెట్రోలు నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. బంక్ లో పని చేసే సిబ్బందికి ఈ విషయం చేరేలా చూసి, ప్రతి బంక్ లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ, ప్రతి పెట్రోల్ బంక్ యజమానులు తమ బంక్ లో "నో హెల్మెట్.. నో పెట్రోలు ఫ్లెక్సీలు రెండు పెట్టి, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రభుత్వ విధానానికి సహకరించాల్సిన అవసరాన్ని వివరించారు.అదనంగా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాశ్, డీఎం రజిత తదితరులు కార్యక్రమంలో హాజరయ్యారు.కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే సూచించిన ఈ నిబంధన, ప్రజల రక్షణలో కొత్త చైతన్యాన్ని తీసుకురావడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల తగ్గింపుకు కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు విశ్లేషిస్తున్నారు

# ఘనంగా మొదటి గ్రామ సభ నిర్వహణ...

పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షతన...



రామగిరి/**ఆకాంక్ష జనవరి 12:** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షతన జనరల్ బాడీ మీటింగ్ మరియు మొదటి గ్రామ సభ నిర్వహించబడింది.ఈ సందర్భంగా పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ సమస్యలపై గ్రామ సర్పంచ్ చిందం మహేష్ ఉపసర్పంచ్ మరియు పంచాయతీ సెక్రటరీ సభ్యులు వివరించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారుఈ గ్రామ సభకు పిలుపునిచ్చిన వెంటనే స్పందించి, పెద్ద మనసుతో సహకరించిన గ్రామ పెద్దలకు, యువతీ యువకులకు, అధికారులు, అనధికార ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలకు సర్పంచ్ చిందం మహేష్ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.లిగ్రామాభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, విద్యుత్, త్రాగునీరు, రోడ్లు తదితర అంశాలపై సభలో విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.లిప్రజల భాగస్వామ్యంతో పన్నూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రామారావు...



పెద్దపల్లిటౌన్/**ఆకాంక్ష జనవరి 12:** పెద్దపల్లి పట్టణంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు.?పెద్దపల్లి పట్టణంలోని 6, 7, 8, 9, 12, 26, 27, 28, 29 వార్డుల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిని కాంక్షించి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.కార్యక్రమంలో భాగంగా,



పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మరియు బందంపల్లి రాజీవ్ రహదారి వద్ద ఏర్పాటు చేసిన నూతన హై మాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామగిరిలో జవీ కప్ క్రీడా జ్యోతి ర్యాలీకి స్వాగతం...



రామగిరి/**ఆకాంక్ష జనవరి 12:** పెద్దపల్లి నుంచి ప్రారంభమైన జవీ కప్ క్రీడా జ్యోతి ర్యాలీ ఃూూ సురేష్ ఆధ్వర్యంలో కమాన్‌పూర్ మండలం మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రామగిరి మండలం పన్నూరు 'ఎక్స్ రోడ్డు వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజారాణి, సర్పంచ్ చిందం మహేష్, సూపరింటెండెంట్ ఉమేష్, ఈసీ మౌనిక, సెక్రటరీలు ప్రేమలత, స్వప్న, సీఓ సత్యం, టీఏలు అఖిల, సుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొని క్రీడా జ్యోతికి ఘన స్వాగతం పలికారు.

## జర్నలిస్టులపై బెదిరింపులు,
# దూషణలు కొనసాగితే సహించేది లేదు....

కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్..

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన...

బెల్లంపల్లి/**ఆకాంక్ష జనవరి 12:** విలేఖరిని అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన జర్నలిస్టులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. క్యాంప్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగిన వారు నినాదాలతో హోరెత్తించారు. ఎన్‌టీవీ జర్నలిస్టును దుర్భాషలాడిన కాంగ్రెస్ నాయకుడు కారుకూరి రామచందర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. వార్తలు రాసినందుకే జర్నలిస్టులను ఇష్టం వచ్చినట్లు తిట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. వార్తలు రాసితే చంపుతామని బెదిరించడం ఏ సంస్కృతిని సూచిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా స్వేచ్ఛపై దాడులను సహించబోమని, జర్నలిస్టులపై బెదిరింపులు, దూషణలు కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని, ఈ అంశంపై ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఘటనపై సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో జర్నలిస్టులు నిరసనను విరమించారు. ఈ ఆందోళనలో పుల్యాల రాజు, వికాస్ యాదవ్, కల్వల ప్రతాప్, నగరం నిరంజన్, అందుగుల రమేష్, బడుగు శ్రీనివాస్, నార్ల శేఖర్, రవిరాజ్, దినేష్, బాబా, సుంకరి నారాయణ, నవీన్, శ్రీహరి, సంపత్, సిద్దిఖీ, సాలిగామ మల్లేష్, ఎల్క తిరుపతి, కొండు మల్లేష్, సుధీర్, తనుగు కృష్ణమూర్తి, దండబోయిన భాస్కర్, కల్వల అరుణ్, సాయి, బద్రి వెంకటేష్, మోసం శ్రీనివాస్, దామెర విజయ్, మేకల ప్రభాకర్, వేముల వెంకటేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, రమేష్, భాస్కర్, లతీఫ్, సంషీద్, దాసరి తిరుపతి, సుభాన్ పాషా, సంతోష్, శ్రవణ్ కుమార్, రవీందర్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కమిషనరేట్‌లో పేకాట,
# కోడిపందాలపై పటిష్ట నిఘా....

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు...

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా...



గోదావరిఖని/**ఆకాంక్ష జనవరి 12:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌లలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పేకాట,కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, నాకాబందీలు నిర్వహించడంతో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కీలక ప్రదేశాలలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. అదే విధంగా కమిషనరేట్ సరిహద్దు జిల్లాలు మరియు ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లతో సమన్వయం ఏర్పాటుచేసి సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేకాట,కోడిపందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100అబ్రశ్రీశ్రీకు సమాచారం అందించాలని ప్రజలను ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

## ఘనంగా స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు...



భద్రాచలం/**ఆకాంక్ష జనవరి 12:** స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలను భద్రాచలం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రాచలం బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వెంకట పుల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. స్వామి వివేకానంద యువతకు అందించిన సందేశాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో యువజన సంఘాలు స్వామి వివేకానంద జీవిత బోధనలను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి, సేవాభావం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఆయన అన్నారు. యువత క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మారుతి కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తాళ్ళూరి పంచాక్షరయ్య, బీజేపీ నాయకులు కుంజా ధర్మతో పాటు పట్టణానికి చెందిన పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతం....




కొమురవెల్లి/**ఆకాంక్ష జనవరి 12:** కిష్టంపేట గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి పంజాల జ్యోతి మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పాలన యంత్రాంగం చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పంజాల జ్యోతి మల్లేశం మాట్లాడుతూ, పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యవంతమైన గ్రామమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత అనేది ఒక్కరోజు కార్యక్రమం కాదని, నిరంతరం పాటించాల్సిన సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాలు శాస్త్రి, ఉప సర్పంచ్ శ్రీలత, వార్డు మెంబర్లు తలారి యాదయ్య , కోడిశెల రజనీకాంత్ పాల్గొని పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామ వీధులు, ప్రజా ప్రదేశాల్లో శుభ్రత చర్యలు చేపట్టి స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్ధిలో స్వచ్ఛత కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల సహకారంతో కిష్టంపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు...



జడ్చర్ల/, **ఆకాంక్ష జనవరి 12:** జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ నాయకులు మాట్లాడుతూ 1863 జనవరి 12న కోల్‌కతాలో జన్మించిన స్వామి వివేకానంద భారతదేశానికి గర్వకారణమైన మహానీయుడని అన్నారు. భారత ప్రభుత్వం 1984లో స్వామి వివేకానంద జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని, 1985 నుంచి ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.స్వామి వివేకానంద బోధనలు, ఆదర్శాలు దేశ యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి" అనే ఆయన సందేశం యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ధైర్యాన్ని నింపుతుందని అన్నారు. సమాజ సేవే పరమార్థమని, వ్యక్తిత్వ వికాసంతో పాటు దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన బోధనల సారమని వివరించారు.స్వామి వివేకానంద భారతదేశపు గొప్ప ఆధ్యాత్మిక నాయకులలో ఒకరని, ఆయన ఆలోచనలు, తత్వాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. యువత ఆయన ఆదర్శాలను ఆచరించి దేశ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, మండల ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మండల నాయకులు దేవేందర్, వెంకటయ్య, నవీన్, రాజు నాయక్, కావాలి నరేష్, రంగారెడ్డి, నారాయణ, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మంథని నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ గా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నా...

అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం....

సుమారుగా 45 కోట్ల విలువైన అభివృద్ధి

కార్యక్రమాలకు శంకుస్థాపన...

తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల

శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు...



మంథని/**ఆకాంక్ష జనవరి 12:** మంథని పట్టణంలో సోమవారం మంత్రి శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించారు. సుమారుగా 45 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంథనిని రాష్ట్రంలోనే మోడల్ గా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మంథని ప్రజలకు సేవలందించడానికి ఎల్లప్పుడు ముందు ఉంటానని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన మాటిచ్చారు. మంథని నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని ఆయన తెలిపారు. మరింత అభివృద్ధి పనులు చేసేందుకు కార్యచరణ చేపట్టామని వివరించారు. మంథనిని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నానని ఆయన వివరించారు. గంగపురి – బోయిన్ పేట వాసుల కష్టాలు తీరడానికి వారధి నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి ప్రణాళిక చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అన్ని కులాల వారు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతోనే కుల సంఘాలకు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందజేయడమే కర్తవ్యం గా ముందుకు వెళుతున్నట్లు ఆయన వివరించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు స్థానిక నృసింహ శివ కిరణ్ గార్డెన్ లో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు స్వయంగా అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ... నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో నిరుపేదలకు సాయం అందించేలా ఇందిరమ్మండ్ల రూపకల్పన చేయడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. నియోజవర్గ ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రయత్నంలో మొదటి దశలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందని, త్వరలో మరిన్ని మంజూరు చేయిస్తానని ఆయన మాట ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత కరెంట్ అందించేలా కార్యచరణ జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, పాక్స్ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మార్కెట్ చైర్మన్ కుదుదులా వెంకన్న కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తు మహమ్మారిని తరిమికొట్టే బాధ్యత యువ కమ్యూనిస్టులదే...

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఎం. బాల నరసింహ పిలుపు...



నాగకర్నూల్/**ఆకాంక్ష జనవరి 12:** సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న మత్తు మహమ్మారిని నిర్మూలించేందుకు యువ కమ్యూనిస్టులైన జనసేవ దళ్ సభ్యులు ముందుండి బాధ్యత తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ పిలుపునిచ్చారు. నేడిక్కడ వెలమ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా జనసేవ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా క్యాంపును జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ అధ్యక్షతన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎం. బాల నరసింహ మాట్లాడుతూ, సమాజంలోని యువత ఫ్యాషన్ మోజులో పడి గంజాయి, డ్రగ్స్, మద్యానికి బానిసలవుతూ తమ పచ్చటి జీవితాలను, కుటుంబాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మత్తు మహమ్మారి సమాజాన్ని క్రమంగా కుంగదీస్తోందని, దీన్ని అంతమొందించేందుకు శాస్త్రీయ భావాలు కలిగిన చైతన్యవంతమైన యువతరం నడుం బిగించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.భారత గడ్డపై పుట్టిన సిపిఐకి 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జనవరి 18న ఖమ్మం మహానగరంలో అఖిల భారత స్థాయిలో భారీ బహిరంగ సభ, గొప్ప ప్రజాప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లాల నుంచి యువ కమ్యూనిస్టులు లాఠీ ట్రైనింగ్‌లో నైపుణ్యం ప్రదర్శిస్తూ ఖమ్మానికి తరలించే కార్యక్రమంలో భాగంగానే ఈ జిల్లా క్యాంపును నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు మారినా అవినీతి, లంచగొండితనం, స్వార్థ రాజకీయాలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనలకు చెక్ పెట్టాలంటే యువత ఉద్యమాల బాట పట్టాల్సిన అవసరం ఉందని, స్వార్థ రాజకీయాల మాయలో పడి చని పోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. మతోన్మాదం, కులవాదం పెరిగిపోయి కులం, మతం పేరుతో దాడులు జరుగుతున్న పరిస్థితుల్లో వాటిని దీటుగా ఎదుర్కొనే బాధ్యతను జనసేవ దళ్ సభ్యులు భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్. ఆనంద్‌జీ, సిపిఐ జనసేవ దళ్ రాష్ట్ర కమాండర్ పంజాల రమేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, జిల్లా కమాండర్స్ బిజా శ్రీనివాస్, బండి లక్ష్మీపతి, జిల్లా సమితి సభ్యులు మారేడు శివశంకర్, బొల్లెద్దుల శ్రీనివాస్, తుమ్మల శివుడు, రవీందర్ కుమార్, టి. కిరణ్ కుమార్, ప్రేమ్ కుమార్, తన్నీరు మల్లయ్య, నరేష్, మధు గౌడ్, డి. వెంకటస్వామి, కొత్త శివకృష్ణ, రమణ, జంగం శివుడు, జి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో మెగా రక్తదాన శిబిరం విజయవంతం..

ఒక బొట్టు రక్తరౌ ఒక జీవితం...

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

తెలంగాణ ప్రాంత సేవా

పముఖ్ శివ శంకర్ పిలుపు...






నాగర్‌కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 12:** బిజినేపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 43 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివ శంకర్ మాట్లాడుతూ, రక్తదానం మహోన్నత సేవ అని, ఒక బొట్టు రక్తం ఒక ప్రాణాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు. యువకులు రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు. యువతలో సామాజిక బాధ్యత పెరిగినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలు సక్రమమైన మార్గంలో నడుస్తాయని తెలిపారు.జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుడి విగ్రహానికి సర్పంచ్ ఇందిరమ్మతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి యువకుడు ముందుకు సాగాలని సూచించారు. దేశం కోసం, తల్లిదండ్రుల కోసం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడే సమాజం హర్షిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో యోగా పతంజలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వస్పరి శివుడు మాట్లాడుతూ, యువత స్వామి వివేకానందుడి జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకుని మంచి నడవడికతో, శీలదక్షతను అలవర్చుకుని నలుగురికి ఉపయోగపడేలా జీవించాలని సూచించారు.గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, మిత్ర వాలంటరీ బ్లడ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ నజీర్ రక్తసేకరణను పర్యవేక్షించారు. శిబిరంలో 43 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకట్రాములు గౌడ్, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, సుదర్శన్, శేఖర్, మధు, విష్ణు, నరసింహ, మురళి, రామ్ మాధవ్, ప్రవీణ్, ప్రతాప్ రెడ్డి, నవీన్ రెడ్డి, బంగారయ్య, సురేష్, కొండారెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## ప్రజావాణిలో 8 ఫిర్యాదుల స్వీకరణ....

నాగర్‌కర్నూల్/**ఆకాంక్ష జనవరి 12:** నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఫిర్యాదుదారుల నుంచి మొత్తం ఎనిమిది ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా విని, వాటిని చట్టపరంగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా భూమికి సంబంధించిన నాలుగు అర్జీలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన రెండు ఫిర్యాదులు, తగు న్యాయం కోరుతూ మరో రెండు అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై వెంటనే స్పందించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్‌ల సీఐలు, డీఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను వారికి వివరించారు. ప్రజలకు న్యాయం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు ఎలాంటి భయాందోళనలేకుండా, మధ్యవర్తులు లేదా పైరవీలు లేకుండా నేరుగా తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా తెలియజేయవచ్చన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతి భద్రతలను పరిరక్షిస్తూ న్యాయసమ్మతమైన పాలన అందించడమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లా పోలీస్ శాఖ ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచే దిశగా నిరంతరం పనిచేస్తుందని, అందుకు ప్రజల సహకారం అవసరమని ఎస్పీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలోనే 100 వైద్య సేవలు...

శాసనసభ్యులు డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి...



నాగర్‌కర్నూల్/**ఆకాంక్ష జనవరి 12:** నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నాగర్‌కర్నూలు శాసన సభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పలు వార్డులను సందర్శించి పారిశుద్ధ్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు పూర్తిగా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైద్యంతో పాటు పారిశుద్ధ్యం కూడా అత్యంత కీలకమని పేర్కొంటూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు 100 శాతం శుభ్రతతో కూడిన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సిబ్బంది, ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులపై ఉందని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల నెట్‌వర్క్ సేవలను వైద్యులు సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. త్వరలో మెడికల్ కళాశాల సమీపంలో 550 పడకల ఆసుపత్రి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.8,000, ద్వితీయ స్థానానికి రూ.6,000, తృతీయ స్థానానికి రూ.4,000, నాలుగో స్థానానికి రూ.2,000 నగదు బహుమతులు అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, జక్కరాజ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. శేఖర్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ రోహిత్, డాక్టర్ అజీమ్, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ కోటేశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, హెడ్ నర్సులు పద్మ, నర్సింగ్ అధికారి ఎం. ఆనంద్, రూపా, రాణి, జానకీదేవి, జ్ఞానేశ్వరి, హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జ్ యాదగిరి, ఆసుపత్రి వైద్యులు, సానిటరీ పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్ బాబు కు వినతి పత్రం
# అందించిన మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ బృందం..



మంథని/**ఆకాంక్ష జనవరి 12:** మంథని డివిజన్ ప్రెస్ భవన్ కు మంథని పట్టణంలో స్థలం, నిధులు కేటాయించాలని సోమవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ బృందం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందచేశారు. డివిజన్ ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు జర్నలిస్టుల పట్ల సానుకూలంగా స్పందించి స్థలంతో పాటు నిధులు కేటాయించే విదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంథని విజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొడారి మల్లేష్, సహాయ కార్యదర్శి మధుర బోయిన కిషన్, మాటేటి కుమార్, సభ్యులు మహా వాది సతీష్, రామడుగు శ్రీనివాస్, అరిగెల నారాయణ,ఏగోలపు సంతోష్, మంథని లక్ష్మణ్ లు పాల్గొన్నారు.

## దళిత హక్కుల అమలుపై తక్షణమే చొరవ చూపాలి...

న్యాయం జరగకపోతే పోరాటం తప్పదు...అఖిల సంఘాల ఐక్యవేదిక




పెద్దపల్లి,**ఆకాంక్ష జనవరి 12:** పెద్దపల్లి జిల్లాలో మహిళా చట్టాలు,మానవ హక్కుల చట్టాలు,ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలు మరియు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ఏవీ సరిగా అమలు కావడం లేదని అఖిల సంఘాల ఐక్యవేదిక నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు ఈ అంశాలను ప్రముఖంగా ప్రస్తావించి,భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఆమోదించారు.ఈ సందర్భంగా ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,రాష్ట్ర నాయకులు మైన్ రాజేశం,ఎస్సీ ఎస్టీ సింగరేణి నాయకులు పులి మోహన్ మాట్లాడుతూ గత కొంతకాలంగా జిల్లాలో మహిళల రక్షణ చట్టాలు,మానవ హక్కుల చట్టాలు,పౌర హక్కులు మరియు ఎస్సీ,ఎస్టీల రక్షణ కోసం రూపొందించిన అత్యాచార నిరోధక చట్టాలు ఏమాత్రం వర్తించడం లేదని స్పష్టం చేశారు. ఈ వైఫల్యానికి సంబంధించి తమ వద్ద అనేక సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం దేవుడెరుగు,వారిపైనే కేసులు పెడుతూ మరింత అన్యాయానికి గురి చేయడం జరుగుతుందని నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలను తక్షణమే అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకొని,బాధితులకు న్యాయం చేయాలని అఖిల సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా యంత్రాంగాన్ని, పాలకులను డిమాండ్ చేశారు.దళిత హక్కుల అమలుపై పాలకులు తక్షణమే చొరవ చూపాలని కోరారు.తమ సమస్యలకు,బాధితులకు న్యాయం జరగనియెడల యావత్ ఎస్సీ,ఎస్టీ వర్గాలందరూ ఏకమై దశలవారీగా పోరాటాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఇందులో భాగంగా,త్వరలో 5 వేల మందితో పెద్దపల్లి కలెక్టరేట్ ముట్టడితో సహా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు ప్రకటించారు.ఈ సమావేశంలో డీఎస్పీ నాయకులు కనకం గణేష్,ఎస్సీ ఎస్టీ నాయకులు దుర్గం నరసయ్య,ఆల్ ఎంప్లాయిస్ నాయకులు బచ్చలి రాజయ్య,ఎస్సీ ఎస్టీ మాజీ విజిలెన్స్ సభ్యులు కొంకటి లింగమూర్తి,అంబేద్కర్ సంఘం మహిళా నాయకురాలు భవాని, రామిళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ...



శ్రీకాకుళం/ఆకాంక్ష జనవరి 12: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. దేవాలయం వెనుక ద్వారం నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి నగలు చోరీ చేసినట్లు సోమవారం గుర్తించారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులకు ఆలయ ధర్మకర్త ముకుందపండా సమాచారం ఇచ్చారు. సుమారు రూ.60 లక్షల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆయన చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డిఎస్పి షేక్ సహబాజ్ అహ్మద్, సిఐ రామకృష్ణ పరిశీలించారు. ఈ దేవాలయంలోనే నవంబర్ 1న తొక్కిసలాట జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తొక్కిసలాట అనంతరం పోలీసుల ఆదేశాల మేరకు దేవాలయంలో దర్శనాలు నిలిపివేశారు. ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

## వందే భారత్ స్లీపర్ రైలు కేవలం సామాన్య ప్రజల కోసమే

ఇందులో వీఐపీ కోటా ఉండదు..

ఎలాంటి ట్రావెల్ పాస్‌లను అనుమతించరు.

అత్యవసర కోటాలకు కూడా అనుమతి ఉండదు.

మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది.



న్యూఢిల్లీ/ఆకాంక్ష జనవరి 12: దేశంలో తొలి వందేభారత్ స్లీపర్ రైలు త్వరలో పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఈ నెల చివరికల్లా ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. గువాహటి-కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశపు మొట్టమొదటి ఈ వందే భారత్ స్లీపర్ రైలు కేవలం సామాన్య ప్రజల కోసమే అందుబాటులో ఉంటుందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందులో వీఐపీ కోటా ఉండదట అంతేకాదు, ఎలాంటి ట్రావెల్ పాస్‌లను అనుమతించరు. అత్యవసర కోటాలకు కూడా అనుమతి ఉండదు. మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ అధికారులు కూడా సాధారణ ప్రయాణికుల్లానే ఇందులో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ రైలులో ప్రయాణికులకు కేవలం కన్ఫామ్ అయిన టికెట్లను మాత్రమే జారీ చేస్తారు. దీని వల్ల వెయిటింగ్ లిస్ట్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.

## రాజకీయ కక్షతోనే ధరణి తొలగించి భూభారతి తెచ్చారు...

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి...



జనగామ/ఆకాంక్ష జనవరి 12: జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన మున్సిపల్ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్ బ్రహ్మాండంగా పనిచేస్తుండగానే రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి వ్యవస్థను తెచ్చిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తప్పుల తడకగా ఉన్న భూభారతిని తొలగించి ధరణి పేరునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. భూభారతి వ్యవస్థలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, ఈ స్కాం వందల కోట్లా లేక వేల కోట్లా అన్నది తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా కథనాల వల్లే ప్రభుత్వం హై పవర్ కమిటీ ఏర్పాటు చేసిందని, అయితే ఆ కమిటీ సమగ్ర విచారణ జరిపి ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారకులను బయటకు తీసుకురావాలని కోరారు. అక్రమాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును రికవరీ చేసి ఖజానాకు జమ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. భూభారతి వ్యవస్థలో మీ సేవా నిర్వాహకులు, సంబంధిత అధికారులు కుమ్మక్కై కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఎమ్మెల్యే ఆరోపించారు. చలానాలు చెల్లించిన రైతులు, కొనుగోలుదారులకు డబ్బు రికవరీ పేరుతో నోటీసులు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడ్డ వారివద్ద నుంచే మొత్తం వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలన్నారు. భూభారతి స్కాంపై పూర్తి బాధ్యత రెవెన్యూ మంత్రి వహించాలని డిమాండ్ చేస్తూ, ప్రజల భూముల భద్రతతో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. రైతులు, భూసంబంధిత లావాదేవీలు చేసే ప్రజలకు న్యాయం జరిగే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రకటించారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం...

గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ హెచ్చరిక...



గంగాధర/ఆకాంక్ష జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాల కోసం నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వంశీకృష్ణ హెచ్చరించారు. చైనా మాంజా పర్యావరణానికి, మానవ జీవనానికి తీవ్ర ముప్పుగా మారిందని, అందుకే దానిపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందని ఆయన స్పష్టం చేశారు. నైలాన్ దారాలతో తయారైన చైనా మాంజా వల్ల పక్షులు, జంతువులు తీవ్రంగా గాయపడుతున్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ మాంజా మనుషుల ప్రాణాలకు కూడా పెను ముప్పుగా మారిందని పేర్కొన్నారు. నిషేధిత చైనా మాంజా విక్రయాలు, నిల్వలు, వినియోగాన్ని అరికట్టేందుకు మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షాపులు, గోదాములను నిరంతరం తనిఖీ చేస్తామని, నిబంధనలు అతిక్రమించి చైనా మాంజాను తయారు చేసినా, విక్రయించినా లేదా నిల్వ ఉంచినా సంబంధితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా మాంజాను సహించేది లేదని స్పష్టం చేశారు. పతంగులు ఎగరవేయాలనుకునేవారు సాధారణ కాటన్ దారాలను మాత్రమే వినియోగించాలని, విద్యుత్ లైన్ల సమీపంలో, రద్దీగా ఉండే రోడ్లపై, జనసమూహం ఉన్న ప్రాంతాల్లో పతంగులు ఎగరవేయవద్దని సూచించారు. పరిసరాల్లో ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సంక్రాంతి పండుగను ఎలాంటి ప్రమాదాలు లేకుండా, సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ వంశీకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రామయ్యపల్లిలో పారిశుధ్య అభివృద్ధి పనులు ప్రారంభం...



ధర్మారం/ఆకాంక్ష జనవరి 12: ధర్మారం మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో పారిశుధ్య అభివృద్ధి పనులను సోమవారం గ్రామ సర్పంచ్ మూల మంగ మల్లేశం గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అదేవిధంగా గ్రామ యువకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానాన్ని చదును చేయించారు. క్రీడా మైదానం అభివృద్ధితో విద్యార్థులు, యువతకు క్రీడా కార్యక్రమాలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మూల మంగ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూతగడ్డ గట్టమ్మ, వార్డు సభ్యులు బాలయ్య, సుజాత రవి, శ్రీకాంత్, గాయత్రి సత్తయ్య, లక్ష్మీ ఐలయ్య, మధుకర్, శ్రీనివాస్, జీపీ సెక్రెటరీ ప్రకాష్, యూత్ నాయకులు భూతగడ్డ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్లకు మౌలిక వసతులు కల్పించకపోతే ఉద్యమం చేపడతాం..

బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరిక...



సూర్యాపేట/ఆకాంక్ష జనవరి 12: కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో నిర్మించిన 560 డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇప్పటికీ మౌలిక వసతులు కల్పించక పోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్డీఓ నేతృత్వంలో సీసీ కెమెరాల మధ్య 560 మంది లబ్ధిదారులను పూర్తిగా నిష్పక్షపాతంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో హెల్త్ సెంటర్ ఏర్పాటుతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్లు కూడా వేయించామని గుర్తు చేశారు. అయితే ఇండ్లకు విద్యుత్, డ్రైనేజీ వంటి కీలక మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన దశలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో గృహ ప్రవేశాలు నిలిచిపోయాయని చెప్పారు. కేవలం రూ.50 లక్షలు కేటాయించి విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేస్తే నిరుపేద లబ్ధిదారులు వెంటనే గృహ ప్రవేశం చేసుకునే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోక పోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ,హుజూర్‌నగర్ నియోజకవర్గాలను వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతులు, ఈ ఇళ్ల కోసం కనీసం రూ.50 లక్షలు కేటాయించక పోవడం లబ్ధిదారుల పట్ల వారి వివక్షను స్పష్టం చేస్తోందని విమర్శించారు. ఇలానే మరి కొంత కాలం నిర్లక్ష్యం కొనసాగితే నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌ను కూడా కలుస్తామని తెలిపారు. ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ సూర్యనారాయణకు అందజేశారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ, బాలాజీ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరైతే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె. నయీమ్, సీనియర్ నాయకులు పైడిమర్రి సత్యంబాబు, మాజీ కౌన్సిలర్లు మామిడి రామారావు, మేదర లలిత, చింతల నాగేశ్వరరావు, అలవాల వెంకట్, కర్ల సుందర్ బాబు, చీమ శ్రీనివాసరావు, గొర్రె రాజేష్, ఇమ్రాన్, అబ్బు, ఉపేందర్, చలిగంటి వెంకట్, మల్లయ్య గౌడ్, శ్రీనివాస్‌తో పాటు పలువురు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు....



జగిత్యాల,ఆకాంక్ష జనవరి 12: జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద స్టేడియంలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయిని పెల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వామి వివేకానంద సందేశాలు శతాబ్దం దాటినా నేటికీ యువతను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని స్వామి వివేకానంద చేసిన పిలుపు నేటి తరానికి మరింత ప్రాసంగికమని అన్నారు. యువత సమాజ మార్పుకు దోహదపడేలా ఆలోచనలు, కార్యాచరణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీనివాసరెడ్డి, రాజేష్, రాజగోపాల్, బొమ్మ కంటి శ్రీనివాస్, భూపాల్ రావు, రత్నాకర్ రావు, రాజేందర్ రావు, హరీష్ తదితరులు పాల్గొని స్వామి వివేకానంద ఆశయాలను స్మరించుకున్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని యువత ఉత్సాహంగా జరుపుకోవాలని, స్వామి వివేకానంద బోధనలు జీవితంలో ఆచరణీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

## నూతన తహసిల్దార్ స్వప్నను కలిసిన బీజేపీ నాయకులు...



జడ్చర్ల/ఆకాంక్ష జనవరి 12: మిడ్జిల్ మండలానికి ఇటీవల నూతనంగా నియమితులైన మండల తహసిల్దార్ స్వప్నను భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ స్వప్నను శాలువాతో సన్మానించి, విధుల్లో ఉత్తమ సేవలు అందించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ పాల్గొన్నారు. అదే విధంగా మండల నాయకులు దేవేందర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సహజారి బేగం, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్, రమేష్ నాయక్, విష్ణు, కావాలి నరేష్ తదితర బీజేపీ నాయకులు హాజరయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ స్వప్న ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పారదర్శక పాలన అందించాలని నాయకులు ఆకాంక్షించారు. మండల అభివృద్ధి, ప్రజా సేవల విషయంలో ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

## జడ్చర్లలో జాతీయ యువజన దినోత్సవం వేడుకలు...



జడ్చర్ల/ఆకాంక్ష జనవరి 12: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండల కేంద్రంలో జాతీయ యువజన దినోత్సవాన్ని భారతీయ జనతా పార్టీ ఘనంగా నిర్వహించింది. బీజేపీ మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ నాయకులు మాట్లాడుతూ, 1863 జనవరి 12న కోల్‌కతాలో జన్మించిన స్వామి వివేకానంద భారతదేశ యువతకు శాశ్వత స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. భారత ప్రభుత్వం 1984లో స్వామి వివేకానంద జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించి, 1985 నుంచి ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. స్వామి వివేకానంద బోధనలు, ఆదర్శాలు దేశ యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ధైర్యాన్ని నాటాయని నాయకులు పేర్కొన్నారు. "లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి" అనే ఆయన సూక్తి కోట్లాది యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. సమాజ సేవ పట్ల అంకితభావం కలిగి, దేశ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని ఆయన బోధనల సారమని వివరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, మండల ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మండల నాయకులు దేవేందర్, వెంకటయ్య, నవీన్, రాజు నాయక్, కావాలి నరేష్, రంగారెడ్డి, నారాయణ, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సభ అధ్యక్షురాలిగా కపిలవాయి కల్పన ఏకగ్రీవ ఎన్నిక...



నాగర్‌కర్నూల్/ఆకాంక్ష జనవరి 12: రాష్ట్ర హిందూ సభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలిగా కపిలవాయి కల్పనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూల్ జిల్లా కేంద్రంలోని అపోహ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన హిందూ రాష్ట్ర సభ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సమావేశంలో రాష్ట్ర హిందూ సభ అధ్యక్షుడిగా రవికుమార్‌ను ఎంపిక చేయగా, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలిగా కపిలవాయి కల్పన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షురాలు కపిలవాయి కల్పన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో హిందూ సమాజాన్ని మరింత బలోపేతం చేయడం, సంస్థ ఆశయాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. హిందూ సమాజ ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సాయి లీల, తేజస్విని తదితర నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, హిందూ రాష్ట్ర సభ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరగడం విశేషంగా నిలిచింది.

## వ్యవసాయ అభివృద్ధికి అనుబంధ రంగాల భాగస్వామ్యం అవసరం...






నాగర్‌కర్నూల్ టౌన్/ఆకాంక్ష జనవరి 12: నాగర్‌కర్నూలు మండల పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, పాలెంలో సోమవారం జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీదేవి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా దక్షిణ తెలంగాణ మండల పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్. కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్. కృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అభివృద్ధిలో అనుబంధ రంగాలైన వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టే ప్రతి కార్యక్రమంలో అన్ని శాఖలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం క్షేత్రస్థాయిలో అందాలంటే శాఖల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీదేవి మాట్లాడుతూ 2026--27 సంవత్సరానికి కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టబోయే కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు భాగస్వాములుగా ఉండాలని కోరారు. వ్యవసాయ ఆధునికరణలో భాగంగా డ్రోన్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి నర్సింహారావు మాట్లాడుతూ నీటి కుంటల్లో చేపల పెంపకం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం. వెంకటేశం మాట్లాడుతూ మామిడి తోటల్లో అల్లం వంటి అంతర్ పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం సాధించవచ్చని వివరించారు. జిల్లా నాబార్డ్ అధికారి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పెద్ద ఎత్తున కూరగాయల సాగు చేపడితే అధిక ఉత్పత్తి, మెరుగైన ఆదాయం సాధ్యమవుతుందని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్. పద్మవేణి మాట్లాడుతూ రైతుల పొలాల్లో వివిధ రకాల వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి శ్రీశైలం గౌడ్, జిల్లా పశుసంవర్ధక అధికారి జ్ఞానశేఖర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, రైతులు లక్ష్మీ చంద్రయ్య, నరసింహారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిశంకర్, శైల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రారంభించాలి...

ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పై సమీక్ష...

ప్రపంచంతో పోటి పడేలా మన విద్యార్థులను సిద్ధం చేయాలి...

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సిఎం. భట్టి విక్రమార్క



పెద్దపల్లి/ఆకాంక్ష జనవరి 12: 2027-28 విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రారంభించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు సోమవారం హైదరాబాద్ నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పై మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఎండి గణపతి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. అధికారుల కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దే ఉద్దేశంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు కాకుండా అందరికీ ఒకే చోట ఉమ్మడి కుటుంబంలా సకల సౌకర్యాలతో పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 79 పాఠశాలలు మంజూరు కాగా 76 పాఠశాలలకు టెండర్లు పూర్తి కాబడి 18 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతి పై సమీక్ష నిర్వహించాలని, ప్రతి నెలలో కనీసం ఒకసారి పాఠశాలల నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని తెలిపారు. పాఠశాలలు నిర్మాణంలో ఉన్న చోట పని తీరు పురోగతి పై డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకొని, 2027-28 విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ అంశం పై జిల్లా కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకూడదని, పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో పాఠశాలలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో విద్యతో పాటు క్రీడలు, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com